

స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో జరగకపోతే 16వ ఆర్థిక సంఘం ద్వారా రావాల్సిన రూ.12,500 కోట్ల నిధులు కోల్పోయే ప్రమాదం ఉంది. అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు, దాడులకు పాల్పడుతూ సుప్రీంకోర్టు తీర్పుపై తప్పుడు ప్రచారం చేస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 23.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 182 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# నవంబర్ 1న 'స్థానిక' సమరం



- నాలుగు చోట్ల నామినేషన్ల గడువు పొడిగింపు
- నేడు, రేపు దాఖలుకు అవకాశం
- కలెక్టర్ కార్యాలయాల్లోనూ స్వీకరణ
- సవరించిన షెడ్యూల్ విడుదల చేసిన ఎస్ఇసి

**అమరావతి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** సుప్రీంకోర్టు ఆదేశాలతో రాష్ట్రంలో కార్పొరేషన్లు, మున్సిపాల్టీల ఎన్నికల షెడ్యూల్‌లో కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో నవంబర్ ఒకటవ తేదిన పోలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు సవరించిన ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం రాత్రి విడుదల చేశారు. రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ ఒకటవ తేదిన పోలింగ్ నిర్వహించనున్నట్లు, రీ పోలింగ్ అవసరమైతే 2వ తేది జరిపి, మూడవ తేది ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు తాజాగా విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తిన కారణంగా నామినేషన్లు దాఖలు చేయలేక పోయిన అభ్యర్థులకు మరో అవకాశం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో నామినేషన్ల దాఖలుకు గడువు పొడిగించారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో కడప మున్సిపల్ కార్పొరేషన్, రాజంపేట మున్సిపాలిటీలలో కొన్ని వార్డులకు మైదుకూరు మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ నామినేషన్ల దాఖలుకు మరోసారి అవకాశం కల్పించారు. తిరుపతి జిల్లాలోని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా కొన్ని వార్డులలో నామినేషన్ల గడువు పొడిగించారు. మిగతా 2లో...

# ఒప్పందం నుంచి... ఉత్పత్తి వైపు



- కేవలం సంతకాలకే పరిమితం కావొద్దు
- పరిశ్రమలు ప్రారంభం కావాలి
- 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులకు కార్యాచరణ షురూ
- ఎస్ఐపీబీ సమీక్షలో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

**అమరావతి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 22వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఎస్ఐపీబీ సమావేశానికి వర్చువల్‌గా మంత్రులు లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నారాయణ, కందుల దుర్గేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. పరిశ్రమలు, ఇంధన శాఖ, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన రంగాల్లో వివిధ పెట్టుబడి ప్రతిపాదనలపై ఎస్ఐపీబీలో అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు. గతంలో కుదుర్చుకున్న ఒప్పందాలు పెట్టుబడులుగా మిగతా 2లో...



## పోలెండ్ ప్రధానితో మోడీ భేటీ



**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో శాంతి నెలకొనేందుకు జరిగే ప్రతి అర్ధవంతమైన ప్రయత్నానికి భారత్ మద్దతునిస్తుందని ప్రధాని మోడీ తెలిపారు. ప్రస్తుతం మూడు రోజుల పాటు భారత్‌లో పర్యటిస్తున్న పోలెండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో గురువారం భేటీ సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో విస్తృతాంశాలపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. భారత్, పోలెండ్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు అనేక నిర్ణయాలు తీసుకున్నామని మోడీ తెలిపారు. మొత్తంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు పెంపొందించేందుకు ఇరు పక్షాలు కృత నిశ్చయంతో వున్నాయని చెప్పారు. రక్షణ, రోదసీ, అణు ఇంధన రంగాల్లో సంబంధాల వృద్ధికి ఒక అవగాహన కుదిరిందన్నారు. ఈ వ్యూహాత్మక రంగాలన్నింటిలో భారత్‌తో కలిసి ఉత్పత్తి చేపట్టడానికి, అభివృద్ధిపరచడానికి పోలెండ్ కంపెనీలను ఆహ్వానించామని వెల్లడించారు. పెరుగుతున్న ద్వైపాక్షిక ఆర్థిక వృద్ధి ఇరు దేశాల భాగస్వామ్యానికి కొత్తగా అవకాశాలు కల్పించిందన్నారు. యురోపియన్ యూనియన్‌తో భారత్ చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు మరింత స్థిరీకరించబడతాయన్నారు. భారత్, పోలెండ్ రెండూ ప్రజాస్వామ్య విలువలు కలిగిన దేశాలేనని, చట్టబద్ధ పాలనను గౌరవించేవేనని పేర్కొన్నార. అంతర్జాతీయ పాలనా సంస్థలు మరింత సమర్ధవంతంగా, సాధికారతతో పని చేయాలంటే సంస్కరణలు తప్పనిసరని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు కేంద్ర విదేశాంగశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

# చంద్రబాబుతో పవన్ భేటీ



2లో

**అమరావతి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో గురువారం ఈ భేటీ జరిగింది. మున్సిపల్ ఎన్నికలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నుంచి రెబల్ అభ్యర్థుల పోటీ, జెడ్‌పిటిసి, ఎంపిటిసి వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం. కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో రెబల్స్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థులను బుజ్జగించే ప్రయత్నం కూటమి తరపున జరగాలని నిర్ణయించినట్లు తెలిసింది. అదేవిధంగా జిల్లా పరిషత్ చైర్మన్లలో కూటమిలో పార్టీల శాతంపైన కూడా చర్చించినట్లు సమాచారం. ఏ పార్టీకి ఎన్ని సీట్లు కేటాయించాలి, ఏ పార్టీకి ఏ జిల్లా కేటాయించాలనే అంశంపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. భద్రత సిబ్బంది లేకుండానే పవన్ చంద్రబాబు ఇంటికి వచ్చారు.

# ఎస్ఈసీకి పూర్తి స్వేచ్ఛ

- కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియ
- అల్లర్లు సృష్టించి సానుభూతి పొందేందుకు వైసీపీ యత్నం
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు



**అమరావతి, అక్టోబర్ 22(జర్నలిస్ట్ ఫైల్) :** సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా చదివి అర్థం చేసుకోవడం రాని గొడ్డలి పార్టీ నాయకుల నుంచి సరైన విశ్లేషణ ఆశించడం మాదే తప్పని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్రలో తానే అత్యంత తెలివైనవాడినని తనకు తాను చెప్పుకునే ధర్మాన సుప్రీంకోర్టు ఆదేశాలు చదివావా? అవి నీకు అర్థమయ్యాయా? అని ప్రశ్నించారు. తుది జాబితా ప్రచురణను ఈ నెల 25 వంకు వాయిదా వేయాలని, నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారనే ఫిర్యాదులు అందితే సంబంధిత సాక్ష్యాధారాలు, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలతో సహా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పరిశీలించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. శాంతిభద్రతల సమస్య కారణంగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారని నిర్ధారణ అయితే ఆ పట్టణ స్థానిక సంస్థల్లో మాత్రమే నామినేషన్ల గడువును పొడిగించాలని, ఆ పొడిగింపు కూడా నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి 48 గంటలు మాత్రమే ఉండాలని స్పష్టం చేసిందన్నారు. ఇంత స్పష్టంగా ఉన్న ఆదేశాలను వక్రీకరించి ప్రభుత్వానికి 'చెంపదెబ్బ' అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా పరిస్థితులు ఉన్నాయి కాబట్టే వైసీపీ అభ్యర్థులు టీడీపీ అభ్యర్థులతో సమానంగా నామినేషన్లు దాఖలు చేయగలిగారని, మేము ప్రజాక్షేత్రంలో తేల్చుకునే వాళ్లమే తప్ప అక్రమంగా అడ్డుకునే వాళ్లం కాదని స్పష్టం చేశారు. మిగతా 2లో...

# నలుగురు భవానీ భక్తులు మృతి



**కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్) :** కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శంఖవరం మండలం కత్తిపూడి నేషనల్ హైవేపై స్కార్పియో వాహనం ఢీకొని ఐదుగురు భవానీ భక్తులు చనిపోయారు. విజయనగరం జిల్లా దెంకాడ నుంచి భవానీ భక్తులు బస్సులో విజయవాడ దుర్గమ్మ ఆలయానికి వెళుతున్నారు. బస్సులో సాంకేతిక సమస్య ఎదురవ్వడంతో ఆపారు. భక్తులు టీ తాగేందుకు వారంతా బస్సు దిగి వెళుతుండగా వేగంగా వచ్చిన స్కార్పియో వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

కాకినాడ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రత్తిపాడు నియోజకవర్గం కత్తిపూడి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు భవానీ భక్తులు ప్రాణాలు కోల్పోయారు. విజయనగరం జిల్లా దెంకాడ నుంచి ప్రైవేటు బస్సులో భవానీ భక్తులు విజయవాడ వెళ్తున్నారు. ఈ సమయంలో బస్సు సాంకేతిక లోపంతో మరమ్మతుల కోసం డ్రైవర్ కత్తిపూడి దగ్గర రోడ్డు పక్కన నిలిపారు. బస్సులో ఉన్న భవానీ భక్తులు టీ తాగేందుకు కిందికి దిగారు.. వారంతా పక్కనే ఉన్న షాపు వైపునకు వెళున్నారు.

భవానీ భక్తుల్ని అదే సమయంలో స్కార్పియో వాహనం వేగంగా వచ్చి వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు భవానీ భక్తులు అక్కడికక్కడే చనిపోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ప్రాణాలు కోల్పోయారు. మృతులు చిరిగిడి ఎర్రయ్య, లింగాల సీతారామ్, బోనేల సత్తిబాబు, తాటిపూడి శివప్రసాద్‌గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్కార్పియో అతి వేగం కారణంగానే ఈ రోడ్డు ప్రమాదం జరిగింది అంటున్నారు. విజయవాడ దుర్గమ్మ దర్శనానికి వెళుతున్న భక్తులు చనిపోవడంతో కుటుంబసభ్యులు, తోటి భక్తులు తీవ్ర విషాదంలో ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

- మూడు చోట్ల లాఠీచార్జి, బాష్పవాయు గోళాల ప్రయోగం: డీజీపీ
- ఎన్నికల్లో బెదిరింపులు ఎదురైతే 100, 112కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచన



**అమరావతి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 31 ఘటనలు నమోదయ్యాయని, మిగతా 2లో...

## వైసిపి ఎంపి అవినాష్ రెడ్డి అరెస్ట్



**పులివెందుల (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రాదేశిక నామినేషన్ల నేపథ్యంలో గురువారం కడప వైసిపి కార్యాలయంలో ఉన్న ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. అదే కార్యాలయంలోనే ఉన్న వైసిపి ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం ఎస్.బి.అంజాద్ బాష, మాజీ మేయర్లు సురేష్ బాబు, పాకా సురేష్‌తో పాటు పలువురు నాయకులను కూడా అరెస్టు చేశారు. అవినాష్‌రెడ్డిని పులివెందుల వైసిపి ఆఫీసుకు తరలించి, నిర్భంధించారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కడపలో అరెస్టుచేసిన నాయకులను పోలీసులు ఆ తర్వాత విడిచిపెట్టారు.

## ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల



2లో

- ఫిబ్రవరి 24 నుంచి ఇంటర్ పరీక్షలు..

## ఇన్‌స్టాగ్రామ్‌లోకి సోనియా గాంధీ ఎంట్రీ




2లో

# నవంబరు 1న 'స్థానిక' సమరం



(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడ ఈ నెల 23, 24 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఇప్పటికే ప్రకటించిన నామినేషన్ కేంద్రాలతో పాటు, సంబంధిత కలెక్టర్ కార్యాలయాల్లో కూడా నామినేషన్లు స్వీకరించను న్నారు. . 'కలెక్టర్ కార్యాలయంలో గానీ, లేదా జిల్లా ఎన్నికల అధికారి సూచించిన కలెక్టరేట్ ప్రాంగణం లోని ప్రత్యేకం ప్రాంతాల్లోగాని నామినేషన్లు స్వీకరించవచ్చు' అని షెడ్యూల్ లో తెలిపారు. బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా 25న రాష్ట్రమంతా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ఈ నెల 25వ తేది ప్రచురించనున్నారు. పొడిగించిన గడువులో కొత్తగా దాఖలైన నామినేషన్లను అక్టోబర్ 25న ఉదయం 8 గంటల నుంచి పరిశీలిస్తారు. కొత్తగా నామినేషన్లు దాకలు చేసిన అభ్యర్థులకు మాత్రమే అదే రోజు మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్టోబర్ 25న మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రచురిస్తారు. రాష్ట్రంలోని మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను అదే రోజు ప్రకటిస్తామని షెడ్యూల్‌లో తెలిపారు.

శాంతి భద్రతల సమస్యల కారణంగా అనేక చోట్ల నామినేషన్లు దాఖలు చేయలేకపోయామంటూ వైసిపితో పాటు పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలంటూ ఆదేశించిన సంగతి తెలిసిందే. సుప్రీం ఆదేశాల ప్రకారం జిల్లా కలెక్టర్లు, ఎస్పిల నుండి అందిన నివేదికలను రాష్ట్ర ఎన్నికల అధికారులు పరిశీలించారు. బుధవారం రాత్రి నుండే ఈ కసరతుత ప్రారంభించారు. ఒకవైపు సుప్రీం తీర్పును అధ్యయనం చేస్తూ, మరోవైపు జిల్లాల నుండి వచ్చిన నివేదికలను పరిశీలించే ప్రక్రియను అధికారులు నిర్వహించారు. గురువారం లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసి నామినేషన్ల గడువు పొడిగింపు పై నిర్ణయం తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించడంతో ఆ మేరకు గురువారం రాత్రి పది గంటల ప్రాంతంలో తాజా షెడ్యూల్‌ను విడుదల చేశారు. గడువు పొడిగిస్తే నామినేషన్ల దాఖలుకు కనీసం 48 గంటల సమయం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో నేడు, రేపు (శుక్ర,శని వారాల్లో) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించాలని నిర్ణయించారు.

## ఒప్పందం నుంచి.. ఉత్పత్తి వైపు



(మొదటి పేజీ తరువాయి)

మారి ఉత్పత్తి ప్రారంభించే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మొత్తం 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులకు సంబంధించి కార్యాచరణ ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. పెట్టుబడుల సదస్సు నిర్వహించేందుకు వీలుగా విశాఖపట్నంలో ఓ అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటయ్యేలా చూడాలని ఆదేశించారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలు కీలకమని సీఎం మార్గనిర్దేశం చేశారు. లాజిస్టిక్స్ హబ్‌లో భాగంగా పోర్టులు, ఎయిర్ పోర్టులతో పాటు ఈస్ట్ వెస్ట్ కనెక్టివిటీపై దృష్టి పెట్టాలని సూచించారు. సెమీ కండక్టర్ రంగంలో తయారీ యూనిట్లతో కూడిన ఎకోసిస్టం రాష్ట్రంలో ఏర్పాటు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## ఎస్ఈసీకి పూర్తి స్వేచ్ఛ



(మొదటి పేజీ తరువాయి)

2021 స్థానిక ఎన్నికల ప్రక్రియలో మీ దౌర్జన్యాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అభ్యర్థులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఫిర్యాదు చేసినా, కోర్టును ఆశ్రయించినా చంపేస్తారనే భయం కల్పించి, 80 శాతం స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర మీది అని ఆరోపించారు. అదే మీ రప్పా రప్పా రాజ్యాంగం అంటూ ఎద్దేవా చేశారు. అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ని అక్రమంగా తొలగించిన తీరు, కోర్టు ద్వారా ఆయన తిరిగి నియమితులైన తర్వాత కూడా ఆయనపై చేసిన వ్యక్తిత్వ హననం ప్రజలు మరిచిపోలేదన్నారు. ఇలాంటి చరిత్ర ఉన్న మీ పార్టీ, మీ గొడ్డలి పార్టీ అధ్యక్షుడు రాజ్యాంగ సంస్థలు, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థల పట్ల మీకున్న గౌరవమేమిటో మీ గత చరిత్రే చెబుతోందని అన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ రెడ్డి ఇచ్చే ఆదేశాల మేరకే గొడ్డలి పార్టీ రౌడీమూకలు క్షేత్రస్థాయిలో బరితెగించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంటే తమ ఉనికికే ప్రమాదమని అల్లర్లు సృష్టించి పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో గులకరాయి, కోడికత్తి నాటకాలతో సానుభూతి పొందేందుకు ప్రయత్నించినట్లే, ఇప్పుడు తామే అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలు లేవంటూ సానుభూతి పొందాలనుకుంటున్నారని విమర్శించారు. కానీ ప్రజలు మీ నైజాన్ని ఇప్పటికే తెలుసుకున్నారని, ఇక మీ ఆటలు చెల్లవని హెచ్చరించారు. పుంగనూరులో ఎంపీ కాన్వాయ్‌లో మారణాయుధాలు, మద్యం బాటిళ్లు పెట్టుకుని ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాలని చూసింది మీ గొడ్డలి పార్టీ కాదా అని సూటిగా ప్రశ్నించారు.

ప్రజాక్షేత్రంలో ఘోర పరాజయం తప్పదని ముందే తెలిసిపోయి, కనీసం పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరకక, ఇప్పుడు పోలీసులు అడ్డుకుంటున్నారని, ఎన్ఓసీలు ఇవ్వడం లేదని కుంటిసాకులు చెబుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. మాది ప్రజాస్వామ్యబద్ధమైన ప్రభుత్వం కాబట్టే రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా తన విధులు నిర్వర్తించగలుగుతోందన్నారు. ఎన్ఓసీల అవసరం లేదని స్పష్టం చేయడంతోపాటు, చిన్న ఫిర్యాదు అందినా పూర్తిస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చేంత స్వేచ్ఛగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు గొడ్డలి పార్టీ గూండాగిరికి, ఫ్యాక్షన్ సంస్కృతికి రాజకీయంగా సమాధి కట్టడం ఖాయమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాష్ట్రాన్ని అశాంతిపాలు చేయాలని చూసే గొడ్డలి పార్టీ ముఠా నాయకుల్లో ఏ ఒక్కరినీ కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

## నలుగురు భవానీ భక్తులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

భవానీ భక్తుల మరణంపై సంతపాన్ని తెలియజేశారు.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఈ రోడ్డు ప్రమాదంపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. 'కాకినాడ జిల్లా కత్తిపూడి వద్ద రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా డెంకాడకు చెందిన భవానీ భక్తులు మృతి చెందడం చాలా బాధాకరం. మృతులకు నివాళులు అర్పిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది' అని ట్వీట్ చేశారు.

## పారా అథ్లెట్ రవణికి క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అభినందనలు

**అమరావతి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** జపాన్‌లో జరుగుతున్న 5వ ఆసియా పారా క్రీడల్లో పతకం సాధించిన భారత పారా అథ్లెట్ రవణి వలసనైనికి క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందనలు తెలిపారు.

రవణి పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసంతో అంతర్జాతీయ వేదికపై భారత పతాకాన్ని రెపరెపలాడించారని మంత్రి పేర్కొన్నారు. ఆమె సాధించిన విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. పారా అథ్లెట్లు అంతర్జాతీయ క్రీడల్లో కాంస్య పతకం సాధించడం ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు.

ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు. రవణి భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## మహిళా పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తి





**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడలోని పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న జాతీయ సారస్ ఆజీవిక మేళా–2026లో భాగంగా, హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో రాజౌచీరుజూ హోటల్‌ను నిర్వహిస్తున్న విజయవంతమైన మహిళా పారిశ్రామికవేత్త శ్రీమతి రంజనా నాయక్, SERP మరియు మీజూహీరా పరిధిలోని సుమారు 300 మంది ఔత్సాహిక స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తలతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ పెవిలియన్‌లో ముఖాముఖి సంభాషించారు.

తన పారిశ్రామిక ప్రయాణాన్ని వివరిస్తూ, రంజనా నాయక్ తన విద్యార్హతలు, బీఎస్సీ డిగ్రీతో పాటు హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో పొందిన విద్యాభ్యాసం తన వ్యాపార ఆలోచనలకు, లక్ష్యాల రూపకల్పనకు దోహదపడినట్లు వివరించారు. సుమారు 20 సంవత్సరాల క్రితం హోమ్‌స్టేలు, అపార్ట్‌మెంట్ ఆధారిత వసతి సేవలతో తన వ్యాపార ప్రస్థానాన్ని ప్రారంభించి, క్రమంగా 70 గదులు, ఆధునిక సౌకర్యాలతో కూడిన లగ్జరీ హోటల్ రాజౌచీరుజూ స్థాయికి తన వ్యాపారాన్ని విస్తరించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆతిథ్య రంగం, పర్యాటక రంగాల్లో మహిళా పారిశ్రామికవేత్తలకు అనేక వ్యాపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా హోమ్‌స్టేలు, అతిథుల వసతి సదుపాయాలు, సర్వీస్డ్ అపార్ట్‌మెంట్లు, పర్యాటకానికి అనుబంధంగా ఉండే ఇతర సేవలను వ్యాపార అవకాశాలుగా మలుచుకోవచ్చని వివరించారు. స్థానిక పర్యాటక ప్రాంతాల్లోని అవకాశాలను గుర్తించడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, నాణ్యమైన సేవలను అందించడం, స్థిరమైన వ్యాపార నమూనాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా మహిళలు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చని ప్రోత్సహించారు.

స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యక్తిగతంగా లేదా సమష్టిగా ఈ రంగాల్లో వ్యాపారాలను ప్రారంభించవచ్చని ఆమె సూచించారు. తద్వారా కుటుంబాలకు స్థిరమైన ఆదాయం లభించడంతో పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు.

ఈ ముఖాముఖి కార్యక్రమం ద్వారా వ్యాపార స్థాపన, వ్యాపార విస్తరణ, పర్యాటక అనుబంధ సేవలను మహిళల ఆధ్వర్యంలోని సంస్థలకు ఒక కొత్త అవకాశంగా మలుచుకోవడం వంటి అంశాలపై మహిళా పారిశ్రామికవేత్తలకు విలువైన అవగాహన లభించింది. రంజనా నాయక్ విజయ ప్రస్థానం, కొత్త వ్యాపార అవకాశాలను ఆత్మవిశ్వాసంతో అన్వేషించాలనుకునే రాజ+ మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

జాతీయ సారస్ మేళాలోని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ పెవిలియన్ విజయవంతమైన పారిశ్రామికవేత్తల అనుభవాలను పంచుకోవడానికి, స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సహించడానికి, కొత్త వ్యాపారాల స్థాపన, ఆవిష్కరణలు, స్థిరమైన జీవనోపాధులను ప్రోత్సహించడానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తోంది.

## ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు సమగ్ర ప్రణాళిక రూపొందించాలి



**విజయవాడ, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరి పుష్కరాల సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి, వినియోగించిన ప్లాస్టిక్ బాటిళ్లను సమర్థవంతంగా సేకరించి రీసైక్లింగ్ చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ఛైర్మన్ డా. పి. కృష్ణయ్య సూచించారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగంపై రాష్ట్రంలోని ప్రముఖ బేవరేజ్ సంస్థల ప్రతినిధులతో గురువారం విజయవాడలోని ఏపీపీసీబీ ప్రధాన కార్యాలయం నుంచి ఛైర్మన్ డా. పి. కృష్ణయ్య వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, వివిధ బేవరేజ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలు కుంభమేళా తరహాలో భారీ స్థాయిలో నిర్వహించనున్న నేపథ్యంలో, పెద్ద సంఖ్యలో భక్తులు గోదావరి తీర ప్రాంతాలకు చేరుకునే అవకాశం ఉందని, ఈ సమయంలో తాగునీరు, పానీయాల సరఫరా ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పేరుకుపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఛైర్మన్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగాన్ని తగ్గించేందుకు సాధ్యమైన మేరకు పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా వృక్షాధారిత పదార్థాలు, పేపర్ వంటి వాటితో రూపొందించిన పర్యావరణహిత సీసాలు, ఇతర ప్రత్యామ్నాయ ప్యాకేజింగ్ విధానాల వినియోగంపై పరిశ్రమలు పరిశీలన చేయాలని కోరారు.

పుష్కరాలకు వచ్చే భక్తులకు ప్లాస్టిక్ సీసాలకు బదులు అవసరమైన ప్రాంతాల్లో వాటర్ డిస్పెన్సర్లు ఏర్పాటు చేయడం, పునర్వినియోగానికి అనువైన సీసాలను వినియోగించేలా చర్యలు చేపట్టాలని బేవరేజ్ సంస్థలకు సూచించారు.

పరిశ్రమలు తమ వనరులు, సామర్థ్యానికి అనుగుణంగా పుష్కర ప్రాంతాల్లో తాగునీటి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయడం, తాగునీటి సరఫరా కోసం స్థానిక యంత్రాంగంతో సమన్వయం చేసుకోవడం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

పుష్కరాల సమయంలో విక్రయించే లేదా పంపిణీ చేసే ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగం అనంతరం నిర్లక్ష్యంగా పడవేయకుండా, వాటిని సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేసే వ్యవస్థను ముందుగానే సిద్ధం చేసుకోవాలని డా. పి. కృష్ణయ్య సూచించారు.

బాటిళ్ల సేకరణ కోసం తగిన కేంద్రాలను ఏర్పాటు చేయడం, వ్యర్థాలను ఇతర చెత్త నుంచి వేరు చేయడం, సేకరించిన బాటిళ్లను అధీకృత రీసైక్లింగ్ సంస్థలకు తరలించడం, ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు పర్యవేక్షణ కొనసాగించడం వంటి చర్యలపై దృష్టి సారించాలన్నారు. పుష్కర ప్రాంతాల్లో స్థానిక సంస్థలు, పారిశుధ్య సిబ్బంది, బేవరేజ్ కంపెనీలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేవలం బాటిళ్లను సేకరించడంతో ముగియకూడదని, వాటిని సరైన విధానంలో రీసైక్లింగ్ చేయించే వరకు బాధ్యతాయుతమైన వ్యవస్థ ఉండాలని ఛైర్మన్ పేర్కొన్నారు.

అలానే పుష్కరాల సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం, సేకరణ, రీసైక్లింగ్ వివరాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించడం అవసరమని ఛైర్మన్ స్పష్టం చేశారు. పుష్కరాల కోసం ఎన్ని ప్లాస్టిక్ బాటిళ్లు అమ్ముడయ్యాయి, ఎన్ని ఉచితంగా పంపిణీ అయ్యాయి, వాటిలో ఎన్ని తిరిగి సేకరించబడ్డాయి, ఎంత పరిమాణంలో రీసైక్లింగ్‌కు పంపించారు, ఇంకా ఎంత వ్యర్థం మిగిలిపోయింది అనే వివరాలను నమోదు చేయాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హిందుస్థాన్ కోకా–కోలా, రిలయన్స్, బిస్లెరీ ఇంటర్నేషనల్, ఆర్టోస్ తదితర సంస్థల ప్రతినిధులు. వాటర్ డిస్పెన్సర్ల ఏర్పాటు, తాగునీరు మరియు పానీయాల సరఫరా, ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణ, రీసైక్లింగ్ వంటి అంశాలపై వివిధ ప్రతిపాదనలు చర్చించారు.

పుష్కరాల సందర్భంగా తమ సంస్థల ద్వారా చేపట్టనున్న కార్యక్రమాలు, అందించగల సహకారం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు అనుసరించనున్న విధానాలు, పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలను పదిహేను రోజుల్లోగా సమర్పించాలని ఆయా సంస్థల ప్రతినిధులను ఛైర్మన్ కోరారు.

గోదావరి పుష్కరాలను పర్యావరణహితంగా నిర్వహించడంలో ప్రభుత్వ శాఖలతో పాటు పరిశ్రమలు, స్థానిక సంస్థలు, ఇతర భాగస్వాములు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంతో పాటు, గోదావరి నది, పరిసర ప్రాంతాల పరిశుభ్రతను కాపాడటం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఛైర్మన్ డా. పి. కృష్ణయ్య పేర్కొన్నారు.

## చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు



(మొదటి పేజీ తరువాయి)

వీటికి సంబంధించి ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేసినట్లు డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. మరో 11 ఘటనల్లో కేసుల నమోదు ప్రక్రియ కొనసాగుతోందని, కనీసం 54 మందిని నిందితులుగా గుర్తించినట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నామినేషన్లను అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నమోదైన ఘటనల్లో 22 హింస, ఘర్షణలకు సంబంధించినవి కాగా, తొమ్మిది నామినేషన్ పత్రాలను లాక్కోవడం, చించివేయడానికి సంబంధించినవని తెలిపారు. మొత్తం 16 సందర్భాల్లో పత్రాల ధ్వంసం జరిగినట్లు పేర్కొన్నారు. ఆరు ఘటనల్లో రాళ్లు, కర్రలతో దాడులు, నాలుగు వాహనాలకు నిప్పుపెట్టడం, రెండు నివాస గృహాలపై దాడులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఒక ఇంటిని ఎర్త్‌మూవర్‌తో కూల్చివేయగా, కాల్పుల ఘటన నమోదైందని వెల్లడించారు. ఘర్షణల్లో ఒక కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడగా, పోటీలో ఉన్న అభ్యర్థితో సహా ఇద్దరు వ్యక్తులు విషమ పరిస్థితిలో ఉన్నట్లు సమాచారం అందిందని పేర్కొన్నారు. ఈ ఘటనల్లో టిడిపి, వైసిపి, సిపిఎంఅభ్యర్థులతోపాటు ఒక స్వతంత్ర అభ్యర్థి దాడులకు, అడ్డంకులకు గురయ్యారని తెలిపారు. చట్టాలను ఉల్లంఘిస్తే పార్టీల కతీతంగా దృఢత్వంతో చర్యలు తీసుకుంటామన్నారు. హింసాత్మక గుంపులను చెదరగొట్టేందుకు మూడు చోట్ల లాఠీచార్జి, ఒక ఘటనలో రెండు బాష్పవాయు గోళాలను ప్రయోగించినట్లు తెలిపారు. వీడియోలు, సిసిటివి దృశ్యాలు, ఫోటోల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేస్తామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా బెదిరింపులు, హింసాత్మక ఘటనలు ఎదురైతే 100, 112కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు.

## ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

**అమరావతి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో 2026 – 2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ గురువారం విడుదలైంది. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఫిబ్రవరి/ మార్చి –2027 వార్షిక పరీక్షల టైమ్‌టేబుల్‌ను ప్రకటించింది. ఫిబ్రవరి 24వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 16వ తేదీ వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలను నిర్వహించనుంది. ఈ మేరకు ఇంటర్ బోర్డ్ సెక్రటరీ రంజిత్ బాషా ఈ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించారు.

ప్రతిరోజూ ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలను బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నిర్వహించనుంది. జనవరి 27వ తేదీన ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్షలు జరగనున్నాయి. జనవరి 29వ తేదీన ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలను నిర్వహించనుంది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జనరల్ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్‌ను బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నిర్వహించనుంది. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9:00 నుంచి 12:00, మధ్యాహ్నం 2:00 నుంచి 5:00 గంటల వరకు రెండు సెషన్లలో (ఆదివారాలతో సహా) నిర్వహించనుంది. ఒకేషనల్ కోర్సులకు కూడా ఇవే తేదీలు వర్తిస్తాయని, వారి టైమ్‌టేబుల్ విడిగా జారీ చేస్తామని ఇంటర్ బోర్డ్ సెక్రటరీ రంజిత్ బాషా తెలిపారు.

## ఇన్‌స్టాగ్రామ్‌లోకి సోనియా గాంధీ ఎంట్రీ




**న్యూ ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఇన్‌స్టాగ్రామ్‌లోకి అధికారికంగా అడుగుపెట్టారు. గురువారం ఇన్‌స్టాలో ఖాతా తెరిచిన ఆమె, త్వరలో విడుదల కానున్న తన జ్ఞాపకాల పుస్తకం 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' ఫస్ట్ లుక్‌కు సంబంధించిన వీడియోను షేర్ చేశారు. లైబ్రరీలో పుస్తకాల మధ్య కూర్చుని, తన పుస్తకంలోని పేజీలను తిరగేస్తూ, పాత ఫొటోలను చూస్తూ కూతురు ప్రియాంకా గాంధీ వాద్రాతో నవ్వుతూ ముచ్చటిస్తున్న వీడియోను సోనియా గాంధీ పోస్ట్ చేశారు. ఈ క్షణాలను అందరితో పంచుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఇది ప్రేమ, బాధ్యత, నష్టం, మనకంటూ ఒక చోటును వెతుక్కునే కథ అని ఆమె పేర్కొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో అడుగుపెట్టిన కొద్ది గంటల్లోనే ఆమెకు విపరీతమైన ఫాలోవర్లు పెరిగారు. అయితే ఆమె కేవలం ముగ్గురిని మాత్రమే ఫాలో అవుతున్నారు. వారు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, కాంగ్రెస్ పార్టీ అధికారిక పేజీ. ఇదిలా ఉంటే.. ఈ పుస్తకంలో ప్రధాని మోడీ, ఆర్ఎస్ఎస్, చైనాతో సరిహద్దుకు సంబంధించిన కొన్ని అంశాలను తొలగించాలని పబ్లిషర్ కోరగా, రచయిత్రి సోనియా గాంధీ దానిని తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత మరో పబ్లిషర్ ఈ పుస్తక ప్రచురణ హక్కులను దక్కించుకోగా, నవంబర్ 10న ఈ పుస్తకం మార్కెట్‌లోకి రానుంది. రాజకీయ జీవితంలో సోషల్ మీడియాకు చాలాకాలం దూరంగా ఉన్న సోనియా గాంధీ, నేటి యువతను, ఓటర్లను చేరుకునేందుకు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ అడుగువేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## క్షీణించిన రూపాయి మారకం విలువ



**ముంబయి (జర్నలిస్ట్ ఫైల్) :** దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస పతనం, అంతర్జాతీయంగా ముడిచమురు ధరల పెరుగుదల రూపాయిపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నాయి. గురువారం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 44 పైసలు క్షీణించి రూ. 94.82కు పరిమితమయ్యింది. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారక మార్కెట్‌లో రూ. 94.47 వద్ద ప్రారంభమైన రూపాయి ఒక దశలో రూ. 94.94 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. బుధవారం 53 పైసలు బలపడి రూ. 94.38 వద్ద ముగిసిన రూపాయి.. ఒక్కరోజులోనే ఆ లాభాల్లో అధిక భాగాన్ని కోల్పోయింది. మరోవైపు అంతర్జాతీయ ముడిచమురు ధర బ్యారెల్‌కు 112.33 డాలర్లకు చేరడం దిగుమతులపై ఆధారపడిన భారత్‌కు ఆందోళన కలిగిస్తోంది. చమురు ధరలు బ్యారెల్‌కు 120 డాలర్ల దిశగా పెరిగితే రూపాయిపై మరింత ఒత్తిడి ఏర్పడే ప్రమాదం ఉందని ఫారెక్స్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. రూపాయి బలహీనపడితే భారత్ చమురు దిగుమతుల బిల్లు పెరగడంతో పాటు, దిగుమతి చేసుకునే ముడి పదార్థాలు, ఎలక్ట్రానిక్స్, ఇతర వస్తువుల వ్యయం కూడా పెరిగే అవకాశం ఉంది. ఇది దేశీయ ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపనుందని విశ్లేషిస్తున్నారు.

## తెనాలిలో కదం తొక్కిన కూటమి శ్రేణులు...



# ప్రజల్లో ఉత్సాహం











### కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఆలపాటి జోరుగా ప్రచారం

**తెనాలి, అక్టోబర్ 22:** తెనాలి పట్టణంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ జోరుగా ప్రచారం నిర్వహించారు. 18, 19, 20, 21, 22, 23, 24వ వార్డుల్లో కూటమి అభ్యర్థులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలుసుకుని మద్దతు కోరారు. ప్రచారానికి ప్రజల నుంచి ఉత్సాహభరిత స్పందన లభించింది.

కూటమి అభ్యర్థుల విజయంతో తెనాలి పట్టణ అభివృద్ధికి మరింత ఊపునివ్వవచ్చని ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం, మెరుగైన మౌలిక వసతులు, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో కూటమి శ్రేణులు నినాదాలతో ఉత్సాహం నింపగా, పలువురు ప్రజలు అభ్యర్థులకు తమ మద్దతు ప్రకటించారు.

"ప్రజల విశ్వాసమే మా బలం. అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం. తెనాలి పట్టణాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలి" అని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థుల విజయానికి ఉత్సాహంగా ప్రచారం నిర్వహించారు.









## ఆంధ్రప్రదేశ్ జీవకళలు కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు





భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు కేవలం పెద్ద పెద్ద కట్టడాలు, పాత కాలం నాటి గుళ్ళు లేదా విజ్ఞాన గ్రంథాలకే పరిమితం కాలేదు. ఒక్కోసారి అవి చాలా చిన్న విషయాల్లో కూడా కనిపిస్తాయి. ఒక చిన్న చెక్క బొమ్మలో, ప్రకాశవంతమైన రంగుల్లో లేదా తరతరాలుగా వస్తున్న ఒక కళలో మన సంస్కృతి దాగి ఉంటుంది. మన ఆంధ్రప్రదేశ్‌లో కూడా అలాంటి రెండు అందమైన కళా రూపాలు ఉన్నాయి: అవే కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు. ఈ రెండింటి తయారీలోనూ చెక్కనే ముఖ్యంగా వాడినప్పటికీ... రెండింటి శైలి, తయారు చేసే విధానాలు, వాటి వెనుక ఉన్న కథలు మాత్రం దేనికదే చాలా ప్రత్యేకమైనవి!

ఈ బొమ్మలు కేవలం అలంకారానికి వాడే వస్తువులు కావు, లేదా పిల్లలు ఆడుకునే ఆటవస్తువులు అంతకంటే కావు. ఇవి మన స్థానిక కళాకారుల సృజనాత్మకతను చాటుతాయి. అంతేకాకుండా, తరతరాలుగా ఈ కళలను బ్రతికిస్తున్న ఆయా కమ్యూనిటీల సంప్రదాయాలను, వారి దైనందిన జీవితాలను మన కళ్ళ ముందుంచాయి.

### కొండపల్లి బొమ్మలు: ఓ చెక్కపై చెక్కిన చక్కటి కథలు

విజయవాడ దగ్గర్లో ఉండే కొండపల్లి గ్రామం... సాంప్రదాయ చెక్క బొమ్మలకు, అంటే మనందరికీ బాగా తెలిసిన 'కొండపల్లి బొమ్మలకి' చాలా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి కళాకారులు తరతరాలుగా, సాదాసీదా చెక్క ముక్కలను చూడచక్కని రంగురంగుల బొమ్మలుగా మారుస్తున్నారు. మన పల్లెటూరి జీవితాలు, మన పురాణాలు, అలాగే రోజూవారీ అనుభవాలను ఈ బొమ్మల రూపంలో ఎంతో చక్కగా కళ్ళకు కట్టినట్లు చూపుతారు.

ఈ బొమ్మల తయారీలో మొదటగా 'తెల్ల పొనికి' అనే తేలికపాటి చెక్కను వాడతారు. ఈ చెక్కను ముందుగా సరైన రీతిలో ఆరబెట్టి, ఆ తర్వాత కళాకారులు దాన్ని రకరకాల ఆకారాలుగా చెక్కుతారు. ఆ విడిభాగాలన్నింటినీ ఒకదానికొకటి అమర్చి, రంగులు అద్దుతారు. అలా మెల్లమెల్లగా బొమ్మ పూర్తిగా తన రూపాన్ని సంతరించుకుంటుంది. ఈ ప్రతి దశలోనూ ఎంతో ఓపిక, శ్రద్ధ, అలాగే ఆ చెక్క గుణగణాలు ఏంటో చక్కగా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

ఈ కొండపల్లి బొమ్మల్లో అత్యంత ఆసక్తికరమైన విషయం ఏంటంటే... ఇవి రకరకాల మనుషులను, పాత్రలను జీవం పోసినట్లు మన ముందుంచుతాయి. రైతులు, సంగీతకారులు, మహిళలు, జంతువులు, పల్లెటూరి వాతావరణం... ఇలా ఎన్నో రకాల విషయాలపై ఈ బొమ్మలను తయారు చేస్తారు. కొన్ని బొమ్మలు మన దైనందిన జీవితంలో కనిపించే సాధారణ సన్నివేశాలను చూపిస్తే, మరికొన్ని మన పురాణాల స్ఫూర్తితో తయారవుతాయి. ఉదాహరణకు శ్రీ మహావిష్ణువు యొక్క పది అవతారాలు అనగా 'దశావతారాల'ను ఎంతో చక్కగా చిత్రీకరిస్తారు.

మన కథలను, సాంప్రదాయాలను ఎలాంటి సంక్లిష్టత లేకుండా చాలా సులభంగా, కంటికి కనిపించే రూపంలో ఇవి భద్రపరుస్తాయి. ఈ బొమ్మల్లోనే ప్రత్యేకత ఇదే. చెక్కతో చేసిన ఒక రైతు బొమ్మో లేక పల్లెటూరి కళాకారుడి బొమ్మో చూడటానికి సాదాసీదా ఆటవస్తువులా అనిపించవచ్చు. కానీ అది పూర్వకాలంలో ప్రజలు ఎలా బతికేవారో, ఎలా పనిచేసేవారో, తమ భావాలను ఎలా వ్యక్తపరిచారు అనే విషయాలను మనకు కట్టింకి కనిపించినట్లు అద్దంలా పట్టి చూపుతుంది. ఈ కళ ద్వారా కొండపల్లి కళాకారులు మన సాంప్రదాయ జీవిత విశేషాలను సజీవంగా నిలబెడుతున్నారు.

### ఏటికొప్పాక బొమ్మలు: రంగులు, సాంప్రదాయాల ప్రపంచం

మరో అద్భుతమైన బొమ్మల తయారీ సంప్రదాయం ఏటికొప్పాక నుండి వస్తుంది. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని వరాహ నది ఒడ్డున ఉన్న ఒక అందమైన గ్రామం. కొండపల్లి బొమ్మల్లాగా వీటిని కూడా ఎంతో అందంగా, వివరణాత్మకంగా చెక్కరు. బదులుగా ఏటికొప్పాక బొమ్మలు మృదువైన ఉపరితలం, గుండ్రని ఆకారాలు, ప్రకాశవంతమైన లక్క రంగుల (lacquerfinishes) మెరుపులతో ఎంతో ప్రత్యేకంగా ఉంటాయి.

ఈ బొమ్మలను తయారు చేయడానికి కళాకారులు సాంప్రదాయకంగా 'అంకుడు' అనే మెత్తని చెక్కను ఉపయోగిస్తారు. ప్రతి బొమ్మను విడివిడిగా క్లిష్టమైన ఆకారాల్లో చెక్కడానికి బదులుగా... వాళ్ళు 'లేత్' (lathe) అనే చెక్క తిప్పుకునే యంత్రాన్ని వాడి, చెక్కను గిర్రున తిప్పుతూ కావలసిన ఆకారానికి తెస్తారు. చక్కటి నైపుణ్యంతో, ఎంతో జాగ్రత్తగా చేస్తూ ఆ సాదాసీదా చెక్క ముక్కను మెల్లమెల్లగా ఒక బొమ్మగా, జంతువుగా, బొంగరంగా లేదా అలంకార వస్తువుగా మారుస్తారు.

ఈ బొమ్మల తయారీ ప్రక్రియలో ముగింపు దశ ప్రత్యేకమైన రూపాన్ని తెస్తుంది. ఏటికొప్పాక బొమ్మలకు ఉండే ఆ మృదువైన, రంగురంగుల ఉపరితలాన్ని తీసుకురావడానికి కళాకారులు లక్క పూతను (lacquer) ఉపయోగిస్తారు. సాంప్రదాయకంగా ఈ రంగులను తయారు చేయడానికి ప్రకృతి సిద్ధమైన రంగులను, స్థానికంగా దొరికే వస్తువులనే ఎక్కువగా వాడతారు. మొత్తానికి చూడటానికి ఆకారంలో చాలా సాధారణంగా ఉన్నప్పటికీ, ఈ బొమ్మలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

ఏటికొప్పాక బొమ్మలు కేవలం వాటి ప్రకాశవంతమైన రంగుల వల్లే కాకుండా, వాటి తయారీలో దాగి ఉన్న నైపుణ్యం వల్ల కూడా ఎంతో ఆకట్టుకుంటాయి. ప్రతి బొమ్మలోనూ చెక్క గుణగణాలు, రంగుల అవగాహన, అలాగే తరతరాలుగా వస్తున్న సాంప్రదాయ పద్ధతులపై కళాకారులకు ఉండే పట్టు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ వస్తువుల్లో చాలా వరకు పిల్లలు ఆడుకునే బొమ్మలుగానే తయారు చేసినప్పటికీ... ఇవి అలంకార వస్తువులుగానూ, మన ఆంధ్రప్రదేశ్ కళా సాంప్రదాయాలను గుర్తుచేసే గొప్ప జ్ఞాపకాలుగానూ ఎంతో విలువైనవిగా నిలుస్తాయి.

### రెండు కళలు, ఒకే భాగస్వామ్య సంప్రదాయం

మొదట చూసేందుకు కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు రెండూ చెక్కతోనే చేస్తారు కాబట్టి ఒకేలా కనిపించవచ్చు. కానీ, కాస్త దగ్గరగా పరిశీలిస్తే మాత్రం రెండు వేర్వేరు అద్భుతమైన కళా రూపాలు మనకు కనిపిస్తాయి. కొండపల్లి బొమ్మలు చక్కటి చెక్కడాలు, కథ చెప్పే విధానానికి ప్రసిద్ధి చెందితే... ఏటికొప్పాక బొమ్మలు మాత్రం ప్రత్యేకంగా తిప్పిన చెక్క ఆకారాలు, అందమైన లక్క రంగుల పనులతో గుర్తింపు తెచ్చుకున్నాయి. ఈ రెండింటిలో తేడాలు ఉన్నప్పటికీ, ఈ రెండు కళలకూ ఒక ముఖ్యమైన పోలిక ఉంది. అదే తరతరాల కళాకారులు ఒకరి నుంచి మరొకరికి అందించిన జ్ఞానం మరియు నైపుణ్యం. ఈ బొమ్మలను తయారు చేయడం అంటే కేవలం కొన్ని పద్ధతులు పాటించడం మాత్రమే కాదు. కళాకారులు తాము వాడే ముడిసంచారులను పూర్తిగా అర్థం చేసుకోవాలి, సొంత నైపుణ్యాలను పెంచుకోవాలి, అంతేకాకుండా నేర్చుకోవడానికి ఏళ్ల తరబడి సమయం పట్టే పనులను ఎంతో శ్రద్ధగా అభ్యసించాలి.

ఏదైనప్పటికీ ఈ సాంప్రదాయాలను కాపాడుకోవడం అంత సులభమేమీ కాదు. దీనికోసం చాలా సవాళ్ళను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఫ్యాక్టరీల్లో పెద్ద ఎత్తున తయారయ్యే బొమ్మలు (మాస్-ప్రొడ్యూస్డ్ టాయ్స్) మార్కెట్లోకి రావడం, అలాగే ప్రజల అభిరుచులు మారుతుండటంతో... ఆధునిక మార్కెట్లో పోటీపడటం మన సాంప్రదాయ కళాకారులకు చాలా కష్టమైపోతోంది. ఇలా చేతితో చేసిన వస్తువులకు కొనుగోలుదారులు దొరకడం కష్టమైనప్పుడు, యువత కూడా తమ కుటుంబాల వంశపారంపర్య వృత్తులను కొనసాగించడానికి అంతగా ఆసక్తి చూపడం లేదు. కాబట్టి, ఈ కళలను సజీవంగా ఉంచాలంటే... తయారైన బొమ్మలను చూసి మురిసిపోతే సరిపోదు. స్థానిక కళాకారులకు అండగా నిలవడం, అందరూ చేతితో చేసిన వస్తువులనే కొనేలా ప్రోత్సహించడం, అలాగే యువతరానికి ఈ నైపుణ్యాలు నేర్చుకునే అవకాశాలు కల్పించడం కూడా అంతే ముఖ్యం. సంస్కృతిని ముందుకు తీసుకువెళ్లే ఆ కళాకారులకు తగిన చేయూత, మద్దతు దక్కినప్పుడే మన సాంప్రదాయం కలకాలం నిలబడుతుంది.

### కాపాడుకోవాల్సిన అవసం ఎంతగానో ఉంది

చేతితో చేసిన ఒక చెక్క బొమ్మను చేతిలో పట్టుకున్నప్పుడు కలిగే అనుభూతే వేరు. దాని రంగులు, ఆకారాల వెనుక దాన్ని తయారు చేసిన వ్యక్తి పడిన శ్రమ, సమయం, వారి సృజనాత్మకత దాగి ఉంటాయి. అది అరచేతిలో పట్టేంత చిన్నదైనా సరే... ఒక సమాజం యొక్క చరిత్రతో, సాంప్రదాయంతో మనల్ని బలంగా అనుసంధానిస్తుంది.

మన సాంప్రదాయం అంటే ఎప్పుడూ పెద్ద పెద్ద కట్టడాలే కాదని కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు మనకు గుర్తుచేస్తాయి. కొన్నిసార్లు మనం గమనించని సాధారణ దైనందిన వస్తువుల్లో కూడా ఆ సంస్కృతి జీవించి ఉంటుంది. ఈ కళలు మన వర్తమానాన్ని గీత దాటి గతం తోటి కలుపుతాయి. ఆధునిక జీవితంలోనూ తమకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకుంటూనే, మన పూర్వీకుల సాంప్రదాయ జ్ఞానాన్ని భద్రపరుస్తాయి.

ఫ్యాక్టరీల్లో ఎటుచూసినా విరివిగా తయారయ్యే వస్తువులే కనిపిస్తున్న ఈ రోజుల్లో, చేతితో చేసిన బొమ్మలు మనకు సరికొత్త విలువను అందిస్తున్నాయి. ఇవి కేవలం వస్తువులు కావు.. వ్యక్తుల ప్రత్యేకతను, వారి ఓపికను, అలాగే ఒక కళాకారుడికి, తన కళకు మధ్య ఉండే అనుబంధాన్ని ఇవి ప్రతిబింబిస్తాయి. ఈ సాంప్రదాయాలను కాపాడుకోవడం అంటే... కాలంతో పాటు వాటిలో ఎలాంటి మార్పులు రాకుండా అడ్డుకోవడం అని కాదు. అలాగని వాటి వెనుక ఉన్న నైపుణ్యాలు, కథలు, మన సాంస్కృతిక గుర్తింపు ఎప్పటికీ కనుమరుగైపోకుండా భద్రంగా కాపాడుకోవడం.

ఆంధ్రప్రదేశ్‌లో కొండపల్లి, ఏటికొప్పాక అంటే కేవలం బొమ్మలు చేసే కేంద్రాలు మాత్రమే కావు. సామాన్య ప్రజల అంకితభావం వల్ల కళ, సంస్కృతి ఎలా నిలబడతాయో చెప్పడానికి ఇవి సజీవ ఉదాహరణలు. కళాకారులు ఇలాగే చెక్కకు రూపం ఇస్తూ, తమ సృష్టికి రంగులద్దుతూ, తమకున్న పరిజ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందిస్తున్నంత కాలం... ఈ కళలు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వారసత్వంలో ఎప్పటికీ ఒక ముఖ్యమైన భాగంగా నిలబడతాయి.




**వ్యాస రచయిత్రి**
**బిర్లాంగి రిషిత**
**సెకండ్ ఇయర్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థిని**
**విఐటి (VIT), వెల్లూరు**
rishithabirlangi7@gmail.com




# జన్వాడలో ఫిరంగి నాలా పూడ్చివేతపై చర్చ!

- ప్రైవేట్ పాఠశాలకు రోడ్డు నిర్మాణం కోసమేనా?
- విచారణతో నిజాలు తేల్చాలంటున్న గ్రామస్థులు
- అధికారుల స్పందనపై ఆసక్తి.. నాలా పరిరక్షణకు యువత డిమాండ్

**శంకర్‌పల్లి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా జన్వాడలో ఫిరంగి నాలా పూడ్చివేతకు సంబంధించిన అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.నాలా ప్రాంతంలో మట్టి పోసి పూడ్చివేస్తున్నారని,ప్రైవేట్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు రోడ్డు నిర్మాణం చేపట్టే క్రమంలో ఈ పనులు జరుగుతున్నాయని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు.అయితే,ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన,అధికారిక నివేదిక వెలువడాల్సి ఉంది.నాలా హద్దులు,భూమి స్వరూపం,నిర్మాణానికి సంబంధించిన అనుమతులు,నీటి ప్రవాహంపై ప్రభావం వంటి అంశాలపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది.ఈ నేపథ్యంలో ప్రజా ఆస్తుల పరిరక్షణపై గ్రామస్థులు,యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజావాణిలో ఫిర్యాదు.. విచారణపై ఎదురుచూపులు

ఫిరంగి నాలా పూడ్చివేతకు సంబంధించి మల్లెల కిషోర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని ఇరిగేషన్,మండల రెవెన్యూ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.అయితే,విచారణలో ఇప్పటివరకు ఏయే అంశాలను పరిశీలించారు? క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారా? నాలా హద్దులు,భూమి రికార్డులను తనిఖీ చేశారా?అనే విషయాలపై స్పష్టమైన సమాచారం అందాల్సి ఉంది.ఫిర్యాదుపై విచారణ ప్రారంభించడం ఎంత ముఖ్యమో,దాని ఫలితాలను పారదర్శకంగా వెల్లడించడం కూడా అంతే ముఖ్యం.నాలా ప్రాంతంలో పనులు జరిగాయా?జరిగితే వాటికి అవసరమైన అనుమతులు ఉన్నాయా?ఆ పనుల వల్ల సహజ నీటి ప్రవాహానికి ఆటంకం కలిగే అవకాశముందా? అనే అంశాలను సంబంధిత అధికారులు ఆధారాలతో నిర్ధారించాల్సి ఉంది.

### అధికారుల పరిశీలనపై ప్రజల దృష్టి

ఈ వ్యవహారంలో రెవెన్యూ,స్థానిక సంస్థలు,నీటిపారుదల శాఖల పరిధిలోని అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.భూమి రికార్డులు,నాలా హద్దులు,నిర్మాణ అనుమతులు,క్షేత్రస్థాయి పరిస్థితులను సమన్వయంతో తనిఖీ చేస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగినట్లు విచారణలో తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.అదే సమయంలో,ఆరోపణలు నిర్ధారణ కాకముందే ఎవరినీ బాధ్యులుగా పేర్కొనడం సరికాదు.ఫిర్యాదుపై




విచారణ ఏ దశలో ఉందో,తదుపరి చర్యలు ఏమిటో అధికారులు వెల్లడిస్తే ప్రజల్లో నెలకొన్న సందేహాలకు సమాధానం లభించే అవకాశం ఉంది.

### ప్రజాప్రతినిధుల స్పందనపై ఆసక్తి

నాలా పరిరక్షణ అంశంలో ప్రజాప్రతినిధులు స్పందించి,సంబంధిత అధికారుల ద్వారా వాస్తవాలను వెలికితీయడానికి సహకరించాలని స్థానికులు కోరుతున్నారు.ఈ వ్యవహారంలో ప్రజాప్రతినిధుల పాత్రకు సంబంధించి కొన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, వాటిని నిర్ధారించే అధికారిక సమాచారం ప్రస్తుతం అందుబాటులో లేదు.అందువల్ల సంబంధిత వ్యక్తుల వైఖరిని, వారి స్పందనను తెలుసుకోవడంతోపాటు, అవసరమైతే అన్ని అంశాలపై నిష్పక్షపాతంగా విచారణ జరగడం ముఖ్యం.

### నాలా పరిరక్షణకు యువత డిమాండ్



ఫిరంగి నాలాను పరిరక్షించాలని కోరుతూ గ్రామ యువత గొంతెత్తుతోంది.తమ ప్రాంతంలోని నీటి ప్రవాహ మార్గాలకు నష్టం కలగకుండా చూడాలని,ఫిర్యాదుపై త్వరితగతిన విచారణ జరిపి ఫలితాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేస్తోంది.ఈ క్రమంలో యువతను బెదిరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.అయితే,ఈ అంశంపై స్వతంత్ర నిర్ధారణ అవసరం.ఎవరైనా బెదిరింపులకు గురైనట్లు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు చట్టప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి.ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు.అదే సమయంలో సమస్య పరిష్కారం శాంతియుతంగా,చట్టబద్ధంగా సాగడం అవసరం.

### విచారణ నివేదిక ఎప్పుడు?

జన్వాడ గ్రామస్థులు ఇప్పుడు అధికారుల స్పందన కోసం ఎదురుచూస్తున్నారు.ఫిరంగి నాలా హద్దులు ఏమిటి?పూడ్చివేత జరిగినట్లు నిర్ధారణ అవుతుందా?సంబంధిత పనులకు అనుమతులు ఉన్నాయా?నీటి ప్రవాహంపై ప్రభావం పడిందా? ఫిర్యాదుపై విచారణ ఎప్పటిలోగా పూర్తవుతుంది? అనే ప్రశ్నలకు అధికారిక సమాధానాలు రావాల్సి ఉంది.ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని తేలినా,విచారణ వివరాలను ప్రజలకు తెలియజేయాలి.వాస్తవాలను ఆధారాలతో వెల్లడించి,ప్రజా ప్రయోజనాలను కాపాడేలా చర్యలు తీసుకోవడమే ఈ వివాదానికి పరిష్కారం చూపగలదు.జన్వాడ ఫిరంగి నాలా వ్యవహారంలో పారదర్శక విచారణ జరిగి సందేహాలకు తెరపడుతుందా?అన్నది ఇప్పుడు వేచి చూడాల్సి ఉంది.

### ఇరిగేషన్ ఏఈ వరప్రసాద్ వివరణ:ఇరిగేషన్ ఏఈ వరప్రసాద్‌ను ఆదాబ్ హైదరాబాద్ ప్రతినిధి సంప్రదించగా

జన్వాడలో ఫిరంగి నాలా పూడ్చివేతపై వచ్చిన ఫిర్యాదుకు సంబంధించి ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించారు.ఈ అంశంపై నార్సింగి మున్సిపాలిటీతో పాటు శంకర్‌పల్లి రెవెన్యూ అధికారులను సంప్రదించి,వివరాలు తెలుసుకున్న అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ తెలిపారు.సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యను పరిశీలించి,వాస్తవాల ఆధారంగా ముందుకు సాగనున్నట్లు వెల్లడించారు.ఫిరంగి నాలా అంశంపై అధికారుల తదుపరి చర్యలపై స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు పోలీస్ శాఖకు నిరంతర స్ఫూర్తి

- పోలీస్ అమరవీరులత్యాగాలు చిరస్మరణీయం.
- వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి పోలీస్ అధికారి బాధ్యత.
- పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ.

**వికారాబాద్ అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పర్యవేక్షణలో అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న కలెక్టర్‌కు జిల్లా ఎస్పీ స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు దేశ భద్రతకు, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో దేశ సరిహద్దులను కాపాడుతున్న సమయంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది .త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ యూనిఫాం కేవలం అధికారానికి చిహ్నం కాదని, అమాయకులను రక్షించడం, చట్టాన్ని గౌరవించడం, రాజ్యాంగ విలువలను కాపాడటం, ప్రజలకు భద్రత కల్పించడం వంటి బాధ్యతలకు ప్రతీక అని అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన రణధీర్ ప్రసాద్ వర్మ, కే.ఎస్. వ్యాస్, అజయ్ కుమార్ సింగ్, సి.ఉమేష్ చంద్ర, వినోద్ కుమార్ చౌబే వంటి పోలీస్ అధికారుల





సేవలను స్మరించుకుంటూ, అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, సమాజం ఎల్లప్పుడూ అండగా నిలవాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మాట్లాడుతూ .పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి నిరంతర స్ఫూర్తినిస్తాయని, వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సానుభూతితో విని, చట్ట పరిధిలో న్యాయం అందించాలని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, అమరవీరులు ఆశించిన సురక్షితమైన, ప్రశాంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అదనపు ఎస్పీ రాజేశ్ మీనా ప్రసంగిస్తూ. ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. తదుపరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఎస్ఐలు, అంతకంటే పైస్థాయి అధికారులు విభాగంలో కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన డబ్ల్యూఎస్ఐపీ మీనాక్షి మొదటి స్థానం, పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐపీ ఎం. ప్రశాంత్ వర్ధన్ రెండో స్థానం, పరిగి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐపీ బి. మోహన కృష్ణ మూడో స్థానం సాధించారు. కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్ఐల స్థాయి వరకు నిర్వహించిన విభాగంలో చెంగోముల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన డబ్ల్యూపీసీ జె. ప్రత్యూష మొదటి స్థానం, కరన్‌కోట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పీసీ బి. సంతోష్ రెండో స్థానం, మార్పల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన డబ్ల్యూపీసీ సీహెచ్. దీపిక మూడో స్థానం సాధించారు. విజేతలను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, డీసీఆర్‌బీ డీఎస్పీ జనయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, తాండూరు డీఎస్పీ యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ వీరేశ్‌తో పాటు సీఐలు, ఆర్‌ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విజయదశమి వేళ మైసమ్మ సన్నిధిలో వంశీచంద్ రెడ్డి

- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థన
- స్థానిక నాయకులతో కలిసి అభిషేకం.. ప్రత్యేక పూజలు నిర్వహించిన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు



**కడ్తాల్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి దంపతులు రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి శ్రీ మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయన దంపతులు అమ్మవారికి అభిషేకం నిర్వహించి,భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.విజయదశమి పర్వదినం సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం విశేషమని పేర్కొంటూ,తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని,ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. రాష్ట్రంలో శాంతి,సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రజల జీవితాల్లో సంతోషం నిండాలని ఆకాంక్షించారు.దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త ఆశలు,ఆనందాలు నింపాలని కోరుకున్నారు. మైసిగండి మైసమ్మ అమ్మవారి ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుండగా,విజయదశమి సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పండుగ వేళ ఆలయానికి వచ్చిన నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.విజయదశమి పర్వదినం సందర్భంగా మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన నాయకులు రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.కాంగ్రెస్ నాయకుల సందడిఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీతా,వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుగంటి శంకర్ పాల్గొన్నారు.వీరితో పాటు సర్పంచులు రాయికంటి బిక్షపతి,ప్రేమ జవహర్ లాల్ నాయక్, పాలకుర్ల మహేందర్ గౌడ్, ఉప సర్పంచులు యాదగిరిరెడ్డి, హీరాసింగ్ తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సేంద్రియ ఆహారంతో ఆరోగ్యకర జీవనం

- చిన్న జీయర్ స్వామీజీ



**హైదరాబాద్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** సేంద్రియ ఆహారానికి ప్రాధాన్యమివ్వడం ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడుతుందని త్రిదండి చిన్న జీయర్ స్వామీజీ అన్నారు. ఖాజాగూడలో ఐస్‌బర్గ్ ఆర్గానిక్ క్రీమరీ నూతన ఐస్‌క్రీమ్ క్రాఫ్ట్ హౌస్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కేంద్రంతో హైదరాబాద్‌లో ఐస్‌బర్గ్ స్టోర్ల సంఖ్య తొమ్మిదికి, దేశవ్యాప్తంగా 12కు చేరిందని నిర్వాహకులు తెలిపారు. 2013లో ప్రారంభమైన సంస్థ సేంద్రియ పదార్థాలతో ఐస్‌క్రీమ్‌లను తయారు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాఖ్యాత, నటి, నిర్మాత సుమ కనకాల, మంతా సూర్యనారాయణ శర్మ పాల్గొన్నారు.

# బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా కసిరెడ్డి సింధూరెడ్డి

- పార్టీ అభివృద్ధికి పూర్తి సమయం కేటాయిస్తా: సింధూరెడ్డి



**శేరిలింగంపల్లి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** చందానగర్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి, బీజేవైఎం తెలంగాణ మాజీ ఉపాధ్యక్షురాలు కసిరెడ్డి సింధూరెడ్డిని భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా నియమించారు. ఈ మేరకు బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ హెమాంగ్ జోషి మంగళవారం ప్రకటించారు. తెలంగాణకు చెందిన యువ మహిళా నాయకురాలికి జాతీయ స్థాయిలో అవకాశం కల్పించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.ఈ సందర్భంగా సింధూరెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో కార్పొరేటర్ అభ్యర్థిగా అవకాశం కల్పించడంతో పాటు, తెలంగాణ బీజేవైఎం ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిన పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. యువమోర్చా ఇచ్చిన ప్రతి పిలుపును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేశానని, ఇకపై కూడా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి తన పూర్తి సమయాన్ని కేటాయిస్తానని పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో సేవ చేసే అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు హెమాంగ్ జోషి, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అరవింద్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండె గణేష్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం. రవికుమార్ యాదవ్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు దసరా శుభాకాంక్షలు

- జమ్మి ఆకులు సమర్పించి విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన చాపల శ్రీనివాస్ ముదిరాజ్.



**వికారాబాద్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ వికారాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు జమ్మి ఆకులు సమర్పించి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పర్వదినం ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇరువురూపలకరించుకుని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

## పండుగల సాయన్న జయంతి మహోత్సవాలకు

# ముదిరాజ్ సంఘం సన్నాహాలు

- హైదరాబాద్‌లో రవీంద్రభారతి వేదికగా వేడుకలు..
- ముదిరాజ్ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు



**శంకర్‌పల్లి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ముదిరాజ్ సమాజ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన పండుగల సాయన్న జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.నేడు ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది.ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకులు, ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు,వివిధ ప్రాంతాల సంఘం ప్రతినిధులు హాజరుకానున్నారు.పండుగల సాయన్న జీవితాన్ని,ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ జయంతి వేడుకలను నిర్వహించనున్నారు.

### ముదిరాజ్ ఐక్యతకు వేదికగా జయంతి వేడుకలు

శంకర్‌పల్లి మండల,మున్సిపల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తలారి మైసయ్య ఆధ్వర్యంలో మండలానికి చెందిన సంఘం నాయకులు,సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని పండుగల సాయన్నకు నివాళులర్పించాలని కోరారు.ముదిరాజ్ సమాజ ఐక్యతను చాటడంతో పాటు, సామాజిక చైతన్యం మరియు ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ఈ వేడుకలు దోహదపడతాయని సంఘం నాయకులు భావిస్తున్నారు.చేవెళ్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాలనుండి ముదిరాజ్ బంధువులు,యువత,సంఘం నాయకులు అధిక సంఖ్యలో హాజరై పండుగల సాయన్న జయంతి మహోత్సవాలను విజయవంతం చేయాలని మైసయ్య పిలుపునిచ్చారు.

# హరీష్ రావుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన కేశని మహేష్



**కడ్తాల్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యూత్ వింగ్ జనరల్ సెక్రటరీ కేశని మహేష్(హెచ్ఆర్) మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావుకు శాలువా కప్పి దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు.

# అమరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీసు సంస్మరణ ర్యాలీ

- నేరేడ్‌మెట్లో పోలీసులతో కలిసి ర్యాలీ నిర్వహించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

**మల్కాజిగిరి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం పోరాడిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 సి జిల్లా గవర్నర్ లయన్ కళ్లెం కృష్ణారెడ్డి, నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 సి, నేరేడ్మెట్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ నేరేడ్మెట్ చౌరస్తా మీదుగా సాగింది. పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు, సభ్యులు పాల్గొని అమర పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి మాట్లాడుతూ, దేశ సరిహద్దుల రక్షణతో పాటు అంతర్గత భద్రతలో పోలీసులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా దళాల దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారత పోలీసు సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. నేరేడ్మెట్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ, పోలీసుల సేవలను గుర్తించి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంస్మరణ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. సమాజ సేవలో లయన్స్ క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో నిర్వహించే సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం నేరేడ్మెట్ పోలీసు అధికారులను, సిబ్బందిని లయన్స్ క్లబ్ ప్రతినిధులు సన్మానించారు.ఈ



కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 320 సి ప్రథమ ఉప గవర్నర్ లయన్ డాక్టర్ మండా సురేష్, ద్వితీయ ఉప గవర్నర్ లయన్ గుంటుక శేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి లయన్ మోహన్ రెడ్డి, కోశాధికారి లయన్ శ్రీనివాసరావు, చీఫ్ కోఆర్డినేటర్ గుడిగంటల రాములు, ప్రోగ్రాం కమిటీ జిల్లా చైర్‌పర్సన్ లయన్ శేఖర్ మోరే, జోన్ చైర్‌పర్సన్ లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి, పి ఎస్ టి ఫోరం కోఆర్డినేటర్ లయన్ నాంపల్లి రూపారెడ్డి, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, లయన్ నాంపల్లి సుధాకర్ రెడ్డి, అంజిరెడ్డి, లక్ష్మీమూర్తి, నాగన్న, రాఘవరెడ్డి, దత్తు, పెద్ది నాగరాజు, కృష్ణవేణి, కలకొండ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ డంప్ యార్డు తరలించాలి..

- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర..
- మీథేన్ గ్యాస్ విడుదల చేయడంలో ప్రపంచ రికార్డు సాధించిన డంప్ యార్డు.
- ప్రపంచంలో నాలుగవ స్థానంలో నిలిచిన వైనం..
- మీథేన్ వల్ల అనేక ఆరోగ్యసమస్యలు
- అయినా పట్టించుకోని ప్రభుత్వాలు.
- చెత్త నిర్వహణపై అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వుంది..
- అయినా ఈ ప్రభుత్వం వినియోగించడం లేదు : ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** జవహర్ నగర్ డంప్ యార్డు తరలించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర జరుపనున్నారు.. డంప్ యార్డు కి వ్యతిరేకంగా ఈ నెల 23 న జవహర్ నగర్ బాధితులతో జవహర్ నగర్ లో సమావేశం జరుపనున్నారు.. 25 న మేధావులు, పర్యావరణ వేత్తలతో డంప్ యార్డు ఏరియాలోనే రౌండ్ టేబుల్ సమావేశం. 27 నుండి డంప్ యార్డుకి వ్యతిరేకంగా పాద యాత్ర.. గ్లోబల్ వార్మింగ్ కి, వాతావరణ మార్పులకు కారణమైన ముఖ్యమైన వాటిలో మీథేన్ గ్యాస్ కూడా ఒకటి. మీథేన్ గ్యాస్ కాలుష్యం తగ్గించడం ప్రపంచం ముందున్న అతిపెద్ద సవాల్.



ఉపగ్రహాల సహాయంతో ప్రపంచంలో మీథేన్ కాలుష్యం ఎక్కువ ఉన్న ప్రాంతాలను గుర్తించారు.

18 దేశాల్లో మొదటి 25 స్థానాల్లో ఉన్న ప్రాంతాలను యూ సి ఎల్ ఏ లా స్కూల్ ప్రకటించింది. ఈ రిపోర్ట్ ప్రకారం నాలుగవ స్థానంలో జవహర్ నగర్ డంప్ యార్డు ఉంది. అర్జెంటీనా దేశ రాజధాని బ్యూనస్ ఐరిష్ మొదటి స్థానం, ఇండోనేషియా దేశ రాజధాని జకార్తా రెండవ స్థానంలో, మలేషియా రాజధాని కౌలాలంపూర్ మూడవ స్థానంలో ఉండగా.. జవహర్ నగర్ డంప్ యార్డు నాలుగవ స్థానంలో నిలిచింది అని సెంట్రల్ యూనివర్సిటీ నుండి వచ్చిన విద్యార్థులు ఈటల రాజేందర్ కు వివరించారు.

**ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ..** జవహర్ నగర్ డంప్ యార్డు రెండు లక్షల జనాభా కోసం ఏర్పాటు చేయబడింది. కానీ ఇప్పుడు కోటి 60 లక్షల మందికి చెందిన చెత్త ఇక్కడికి వస్తుంది. చుట్టూ 25 కిలోమీటర్ల రేడియస్ లో భూగర్భ జలాలు విషతుల్యం అయ్యాయి. 30 కిలోమీటర్ల రేడియస్ లో ఉన్న ప్రజలకు విషపు గాలులతో ఊపిరితిత్తుల సమస్యలు, చర్మ సమస్యలు వస్తున్నాయి. కూరగాయలు అమ్ముకొని, ఇల్లల్లో పని చేసుకుని కడు బీదరికంలో ఉన్నవారు సంపాదించుకునే ప్రతి పైసా ఆరోగ్యం కోసం ఖర్చు పెట్టాల్సిన దుస్థితి వచ్చింది. జనావాసాలకు దూరంగా డంపింగ్ తరలించాలని అనేక సంవత్సరాలుగా ఉద్యమం నడుస్తుంది.

ఇంత టెక్నాలజీ వచ్చిన తర్వాత కూడా చెత్త వల్ల ఇన్ని సమస్యలు ఎదుర్కొనే దుర్మార్గమైన పరిస్థితికి చరమగీతం పాడాలి.

ఐటి బాంబే వారు ఇలాంటి చెత్త డంపు యార్డుల నిర్వహణ కోసం టెక్నాలజీ కూడా అందించారు.. కానీ ఈ ప్రభుత్వం వాటిని అందిపించుకోవడం లేదు. ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్నారు. ప్రగల్బాలు పక్కనపెట్టి ఈ సమస్య నుంచి ఇక్కడి ప్రజలకు శాశ్వత పరిష్కారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నాను.

అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేశారు తప్ప సమస్యకు పరిష్కారం దొరకలేదు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు కూడా దీనిమీద రీసెర్చ్ చేశారు.. ఇది ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద డంపింగ్ యార్డ్ అని, ఎక్కువ విష పదార్థాలను విడుదల చేస్తున్న డప్పు యార్డ్ ఇది.. వెంటనే తగు చర్యలు తీసుకోకపోతే ఇక్కడ నివసించే ప్రజలకు ఎక్కువ సమస్యలు వస్తాయని చెప్తున్నారు.. వీరి సూచనలు పాటించి జీరో పొల్యూషన్ దిశగా అడుగులు వేయాలి. నాలుగు దిక్కులా చెత్తను పంపించి ఇక్కడకు రాకుండా చూడాలి.

# కడ్తాల్ దుర్గామాత నిమజ్జనం!

- వైభవంగా గ్రామ పురవీధుల్లో అమ్మవారి శోభాయాత్ర
- రచ్చబండ వద్ద అల్లాయ్ బల్లాయ్ ప్రత్యేక ఆకర్షణ
- రూ.51 వేల ధర పలికిన అమ్మవారి చీర..
- ఉత్సాహంగా పాల్గొన్న యువత




**కడ్తాల్ అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు.తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు, ప్రత్యేక అలంకరణలు,వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తుల పూజలందుకున్న దుర్గామాతకు విజయ దశమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. గ్రామ పురవీధుల్లో సాగిన అమ్మవారి శోభాయాత్ర భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

**పురవీధుల్లో అంబరాన్నంటిన సంబరాలు**

అమ్మవారి నిమజ్జనాన్ని పురస్కరించుకుని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు.భక్తి పాటలు, నృత్యాలు, జై దుర్గామాత నినాదాలతో గ్రామ పురవీధులు మార్మోగాయి. మహిళలు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికారు. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు, చివరి రోజు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

**రచ్చబండ వద్ద అల్లాయ్ బల్లాయ్ ప్రత్యేక ఆకర్షణ**

దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో భాగంగా గ్రామంలోని రచ్చబండ వద్ద నిర్వహించిన అల్లాయ్ బల్లాయ్ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే విజయ సందర్భంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఊరేగింపు హను మాన్ గాడ్ ఆలయం వద్ద జమ్మి పూజ అనంతరం రచ్చబండ వద్ద స్వామి వారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో గ్రామ ప్రజలు, స్థానికులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని పండుగ సంబరాలను మరింత సందడిగా మార్చారు. సంప్రదాయాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సాగిన వేడుకలు గ్రామ ప్రజల్లో ఆనందోత్సాహాలను నింపాయి.



**రూ.51 వేలు పలికిన అమ్మవారి చీర**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి సమర్పించిన చీర రూ.51 వేలకు గ్రామానికి చెందిన రాగిపణి లక్ష్మణా చారి దక్కించుకున్నాడు.అమ్మవారి చీరకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.అమ్మవారిపై భక్తులకున్న శ్వాసం,ఆధ్యాత్మిక అనుబంధానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది.

**భక్తిశ్రద్ధలతో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు**

తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు,ప్రత్యేక అలంకరణలు,భక్తి కార్యక్రమాలతో కొనసాగిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు నిమజ్జనంతో ముగిశాయి. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన గ్రామస్తులు, యువకులు, భక్తులు పరస్పర సహకారంతో కార్యక్రమాలను నిర్వహించారు.అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత మిత్రమండలి ఉత్సాహ కమిటీ అధ్యక్షుడు కరుణాకర్,సర్పంచ్ రాయికంటి బిక్షపతి,ఉపసర్పంచ్ ఈరెడ్డి యాదగిరి రెడ్డి,మాజీ సర్పంచులు గూడూరు లక్ష్మీ నరసింహ రెడ్డి,వేణు పంతులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు గూడూరు జంగారెడ్డి, సభ్యులు పిప్పళ్ళ యాదయ్య, కందికంటి రమేష్ గౌడ్,పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు గొల్ల సత్యం యాదవ్, నాయకులు కంబాల పరమేష్, రవీందర్ రెడ్డి, గూదే రాములు, చి ప్ప బిక్షపతి, నాగార్జున, రాఘవాచారి, ఎగిరిశెట్టి బాబు, మల్లేష్, శ్రీకాంత్, యాదగిరి, చెన్నయ్య, గణేష్ గౌడ్, జగత్ రెడ్డి, పర్వత్ కుమార్ యాదవ్, రాజేందర్ యాదవ్,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ ఎన్నారైల అభివృద్ధి, ఆర్థిక భరోసా..

- దిశగా ఏపీ.ఎన్.ఆర్.టి. కీలక ఆలోచనలు.. !
- నాగేంద్రబాబుని కలిసిన వేమూరి రవి..
- ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చలు..

**విజయవాడ, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ తాడేపల్లిలోని ఏపీ.ఎన్.ఆర్.టి. కార్యాలయంలో ఏపీ.ఎన్.ఆర్. టి. చైర్మన్ వేమూరి రవి, నాగేంద్ర బాబుని మర్యాదపూర్వకంగా కలిసి, గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న ఎన్నారైల అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్తు భద్రతకు సంబంధించిన పలు అంశాలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా వేమూరి రవి ఎన్నారైల అభ్యున్నతి కోసం చేస్తున్న ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలు ఎంతో ఆశాజ నకంగా అనిపించాయి. నాకు విలువైన సమయాన్ని కేటాయించి, ఎన్నారైల సమస్యలు, అవసరాలు, అభివృద్ధి అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.. ఏపీ.ఎన్.ఆర్.టి. అంటే కేవలం సేవా కార్య క్రమాలకే పరిమితం కాకుండా... ఎన్నారైలకు ఆర్థిక భరోసా, సామాజిక భద్రత, స్వావలంబన కల్పించే దిశగా కూడా ముందుకు సాగాలి.



ఈ లక్ష్యంతో ఎన్నారైల భవిష్యత్తుకు ఉపయోగపడే విధానాల రూపకల్పనపై ఆలోచనలు సాగడం, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయోజనకరమైన పాలసీలను పరిచయం చేయాలనే దృక్పథం ఎంతో సంతోషాన్నిస్తోంది. గల్ఫ్‌లో కష్టపడి పనిచేస్తున్న ప్రతి తెలుగు కుటుంబానికి భద్రత, భరోసా, అభివృద్ధి అవకాశాలు అందుబాటులోకి రావాలన్నదే నా ఆకాంక్ష.

సేవ నుంచి సాధికారత వైపు... సంక్షేమం నుంచి ఆర్థిక భరోసా వైపు... ఏపీ.ఎన్.ఆర్.టి. ప్రయాణం ఎన్నారైల జీవితాల్లో సానుకూల మార్పులకు నాంది కావాలని ఆశిస్తున్నాను. సేవే లక్ష్యం... ఎన్నారైల అభివృద్ధే ధ్యేయం! అని ఎం. వాసుదేవరావు, ఏపీ.ఎన్.ఆర్.టి. గల్ఫ్ రీజనల్ కో ఆర్డినేటర్, గల్ఫ్ ప్రైమ్ జర్నలిస్ట్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు..

# సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచిన మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు

- రోగులకు పండ్ల పంపిణీ.. వృద్ధులకు నూతన వస్త్రాల అందజేత
- కౌన్సిలర్లు చాకలి అశోక్, సమీయొద్దీన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు



**శంకర్‌పల్లి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా,ఆపన్నులకు అండగా నిలుస్తూ,సేవాభావాన్ని చాటుకునేలా శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను కౌన్సిలర్లు ఘనంగా నిర్వహించారు.

ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని 13వ వార్డు కౌన్సిలర్ చాకలి అశోక్,11వ వార్డు కౌన్సిలర్ సమీయొద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు, మహారాజ్‌పేట్‌లోని జాయ్ ఫౌండేషన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు నూతన వస్త్రాలు, పండ్లు అందజేశారు. సంతోషకరమైన సందర్భాన్ని సామాజిక సేవకు వేదికగా మలచడం ద్వారా మానవత్వం, సేవానిరతి ప్రాధాన్యతను చాటారు.

# పోలీసుల త్యాగాలు.. దేశానికి చిరస్మరణీయం!

- ఆమనగల్లులో ఘనంగా పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- ముఖ్య అతిథిగా ఏసీపీ జానకీ రెడ్డి.. అమర వీరులకు ఘన నివాళులు

**ఆమనగల్లు అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం పోరాడి అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని పలువురు పోలీసు అధికారులు పేర్కొన్నారు.రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండల కేంద్రంలో పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని ఆమనగల్ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏసీపీ జానకీ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.




ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల స్మారక స్తూపం వద్ద,ఎస్సై హన్మంత్ రెడ్డి విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళు లర్పించారు.దేశ భద్రత,ప్రజల రక్షణ,శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకున్నారు.అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యం**

ప్రజల ప్రాణ,ఆస్తుల రక్షణతో పాటు సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని అధికారులు గుర్తుచేశారు.విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న పోలీసుల సేవలను కొనియాడారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమర పోలీసుల త్యాగాలు ఎప్పటికీ సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొని అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు.

# ముగిసిన మైసిగండి దేవీ శరన్నవరాత్రులు

- విజయదశమి రోజున శ్రీ రాజరాజేశ్వరీ దేవి రూపంలో దర్శనమిచ్చిన మైసమ్మ తల్లి
- తొమ్మిది రోజుల పాటు వైభవంగా పూజలు..
- అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



**కడ్తాల్ అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి శ్రీ మైసమ్మ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా ముగిశాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయదశమి పర్వదినాన అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో అలంకరించిన అమ్మవారికి అర్చకులు నిత్య పూజలు, అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. విజయదశమి సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..**

దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజలు,ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు.విజయదశమి పర్వదినంతో నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ లక్ష్మీ శిరోలి, సభ్యులు ఆర్పీ జ్యోతి అరుణ్ దంపతులు, ఎర్రోళ్ల రాఘవేందర్,సిబ్బంది చంద్రయ్య, కృష్ణ, రాములు, శ్రీనివాసులు, బాలబ్రహ్మ చారీ, శ్రవణ్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

# పాలపిట్టను విడుదల చేసిన ఘటనపై కేసు నమోదు..



**హైదరాబాద్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** దసరా వేడుకల్లో భాగంగా నిన్న రాత్రి ఉప్పల్ మినీ స్టేడియంలో పాలపిట్టను విడుదల చేసిన ఘటనపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఉప్పల్‌కు చెందిన ఈగ చంద్రశేఖర్, పి.పరమేశ్వర్‌రెడ్డి , మరికొందరి ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా అటవీ అధికారి వేణుమాధవ్ తెలిపారు. దీంతో వన్యప్రాణి సంరక్షణ చట్టం - 1972లోని సంబంధిత సెక్షన్లతో పాటు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35 కింద అక్టోబర్ 21న పీ ఓ ఆర్ నం. 16-03/2025-26తో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ కొనసాగుతోందని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

విచారణ పూర్తయిన తర్వాత చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని, నిందితులను సంబంధిత మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తామన్నారు.

# ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపిన రామకృష్ణారెడ్డి



**మణికొండ, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, పలువురు నాయకులు కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. మణికొండ క్రికెట్ గ్రౌండ్‌లోని మర్రిచెట్టు వద్ద దసరా ఉత్సవాల నిర్వహణకు అవసరమైన గ్రౌండ్‌ను కేటాయించడంలో ప్రత్యేక చొరవ చూపి, సంబంధిత అధికారులతో మాట్లాడి సహకరించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉప్పలమ్మ రేణుక ఎల్లమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో అన్నదానం

- అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్..



**మల్కాజిగిరి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** మల్కాజిగిరి నియోజకవర్గం, మీర్జాలగూడ డివిజన్ పరిధిలోని భవాని నగర్‌లో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. స్థానికంగా ఉన్న శ్రీశ్రీశ్రీ ఉప్పలమ్మ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదం అందించే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని చాటే అన్నదాన కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని స్థానికులు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భక్తుల మధ్య ఐక్యతను పెంచడంతో పాటు, సేవా దృక్పథానికి ప్రోత్సాహాన్ని అందిస్తాయి.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మధు భవాని, ప్రెసిడెంట్ కె. సత్యనారాయణ, దిలీప్ కుమార్, ఉదారి సత్యనారాయణ యాదవ్, ఎస్. రవి, కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో దుష్ట శక్తులను రూపుమాపాలి

- విజయదశమి ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలి
- శాంతి, సామరస్యాలతో ముందుకు సాగుదాం
- ఐక్యతతోనే ప్రగతి సాధ్యమవుతుంది
- చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసర పండుగ
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు





**ఖమ్మం, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం పట్టణ పరిధిలోని రైటర్ బస్తీతో పాటు రామవరంలోని అంబేద్కర్ చమన్ వద్ద సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక జమ్మి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా రావణాసురుడి దిష్టిబొమ్మ దహన (రావణ వధ) ఘట్టాన్ని లాంఛనంగా ప్రారంభించారు. బాణసంచా వెలుగుల నడుమ రావణ వధను వీక్షించేందుకు భారీగా తరలివచ్చిన అశేష జనవాహినిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. సమాజంలో నెలకొన్న అసమానతలు, అన్యాయాలు, చెడు ఆలోచనలను అంతమొందించి ధర్మమార్గాన్ని అనుసరించడమే దసరా పండుగ ఇచ్చే అసలైన సందేశమని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి ధ్యేయంగా ప్రజలంతా కలసికట్టుగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు, కార్మికులకు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సింగరేణి గుర్తింపు సంఘం నాయకులు వంగ వెంకట్, రమణమూర్తి, జె గట్టయ్య, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, మునిగడప పద్మ, ధర్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వద్దిరాజు ఆధ్వర్యంలో
## మున్నూరుకాపు సంఘం బలోపేతం
## : ఆకుల గాంధీ



**ఖమ్మం, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** పార్లమెంట్ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో ఖమ్మం ఉమ్మడి జిల్లాలో మున్నూరుకాపు సంఘం బలోపేతం అవుతోంది అని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ పేర్కొన్నారు. బుధవారం మున్నూరుకాపు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం అధ్యక్షతన అందుబాటులో ఉన్న మున్నూరుకాపు ముఖ్యలు, మున్నూరు కాపు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ముఖ్య విషయాల గురించి చర్చించడం జరిగింది. వారు స్పందించి పెండింగ్ లో ఉన్న మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ నిర్మాణం గురించి ఎంపి నిధులనుండి వచ్చినటువంటి 50 లక్షల రూపాయల నిధులను వెంటనే విడుదల చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ని కోరడం జరిగింది. దానికి కలెక్టర్ వెంటనే సానుకూలంగా స్పందించి నిధుల విడుదలకు అంగీకారం తెలిపారు. అంతేకాకుండా రవిచంద్ర 6 నెలల లో ఫంక్షన్ హాల్ నిర్మాణం జరగాలని సూచించారు . అవసరమైతే నిధులు సరిపోని పక్షం లో కావాల్సిన నిధులు అందజేస్తానని హామీ ఇవ్వడం జరిగింది . అదేవిధంగా జిల్లా నూతన కార్యవర్గ సమావేశాన్ని కూడా ఈ నెల 28 న మున్నూరు కాపు హాస్టల్ నందు ఏర్పాటు చేస్తామని తెలియజేయడం జరిగింది . ఈ కార్యక్రమం న కు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రని, మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు, ఖమ్మం జిల్లా ఇంచార్జి ని ముఖ్య అతిధులు గా రావాలని కోరడం జరిగింది . అంతేకాకుండా వచ్చే నెల కార్తీక మాసం నవంబర్ 15 న ఆదివారం నాడు మున్నూరుకాపు వనసమారాధన నిర్వహించాలని తీర్మానం చేయడం జరిగింది . తదుపరి ఖమ్మం నగరం కొత్తగూడెం సమీపంలో గల చెరుకూరి మామిడి తోట ను పరిశీలించడం జరిగింది . మామిడి తోట ను నిర్ణయించడం జరిగింది . ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ , జిల్లా గౌరవ అధ్యక్షులు కొత్తా సీతారాములు , గౌరవ సలహా దారులు పాదిల రవి కుమార్ , నాయకులు పారా నాగేశ్వరరావు , మెంతుల శ్రీశైలం , పసుపులేటి నాసరయ్య , మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం , ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేందర్ , కోశాధికారి మడూరి పూర్ణ , మున్నూరు కాపు ప్రముఖులు తాళ్లూరి హనుమంతరావు , జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాసరావు , జిల్లా ఉపాధ్యక్షులు మాటేటి నాగేశ్వరరావు , జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం నాగేశ్వరరావు , ఖమ్మం నగర అధ్యక్షులు పారా ఉదయ్ , నగర కోశాధికారి , జివివిఎల్ నరసింహారావు , జిల్లా యూత్ ఉపాధ్యక్షులు నానబాల హరీష్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలశెట్టి జయప్రకాష్ తదితరులు ఉన్నారు

# 48వ డివిజన్‌లో బతుకమ్మ, విజయదశమి వేడుకల సందర్భంగా మహిళలకు పట్టు చీరల పంపిణీ

- ప్రజాసేవే లక్ష్యం, మహిళల ముఖాల్లో చిరునవ్వులే మా సంతోషం : అల్లే సాయికిరణ్, రూపాదేవి
- తుమ్మల నాగేశ్వరరావు, తుమ్మల యుగంధర్ ప్రేరణతో పేదలకు చేయూత









**ఖమ్మం, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఖమ్మం నగరంలోని 48వ డివిజన్‌లో బతుకమ్మ, విజయదశమి పండుగలను పురస్కరించుకొని అల్లే సాయికిరణ్, రూపాదేవి దంపతుల ఆధ్వర్యంలో సుమారు 1,500 మంది మహిళలకు పట్టు చీరలను పండుగ కానుకగా అందించడం జరిగింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను, విజయానికి ప్రతీక అయిన విజయదశమిని మహిళలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం అని సాయికిరణ్ తెలిపారు. మనకు మార్గదర్శకులుగా నిలుస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తుమ్మల యుగంధర్ ప్రజల సంక్షేమం, అభివృద్ధి పట్ల చూపుతున్న చొరవ, ప్రజలతో మమేకమై పనిచేయాలనే స్ఫూర్తి మాకు ఎంతో ప్రేరణనిస్తాయి.వారి పట్ల గౌరవభావంతో, ప్రజల ఆశీస్సులను పొందుతూ, మహిళలకు అండగా నిలుస్తూ, 48వ డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలన్నదే మా సంకల్పం. అల్లే సాయికిరణ్, రూపాదేవి దంపతుల తరఫున మహిళలందరికీ బతుకమ్మ, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ కాంగ్రెస్ పార్టీ భోజట్ల సత్యనారాయణ, బుడిగం వెంకన్న, ఎస్‌కే జహీర్, బండ వెంకటేష్, సంపత్, శేఖర్, మేచి రామకృష్ణ, యాగలక్ష్మి , సారంగపాణి, హరీష్, కిషోర్, షంషుద్దీన్, రఫీ, రాహుల్ రెడ్డి, సతీష్ తదితర కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఖమ్మంలో వామపక్షాలతో కలిసి తలపెట్టిన ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలి రావాలి

- బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర .



**ఖమ్మం, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

నిరుపేదలకు ఇండ్లు కేటాయించే విషయంలో అధికార పార్టీ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఇందుకు నిరసనగా వామపక్షాలతో కలిసి ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఈనెల 22వతేదీ గురువారం ఉదయం తలపెట్టిన ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా ఎంపీ రవిచంద్ర బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర ఖమ్మం తెలంగాణ భవన్ లో బుధవారం జరిగిన సన్నాహాక సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య,జెడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్ తదితర నాయకులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ,ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన నిరుపేదలకు జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టేందుకు వామపక్షాలు కలిసి రావడం అభినందనీయమన్నారు.ఇండ్ల మంజూరు సంబంధించి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 33 రద్దు గురించి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావుతో మాట్లాడి న్యాయ పోరాటం చేస్తామన్నారు.ఈ జీవో ద్వారా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తూ,వాటిని మొత్తంగా కాంగ్రెస్ నాయకులతో నింపారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు.కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ లోకి వలస పోకుండా ఉండేందుకే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసినట్లుగా కనిపిస్తున్నదన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో డబుల్ బెడ్ రూం ఇండ్లను గొప్పగా నిర్మించి రాజకీయాలకు అతీతంగా లాటరీ పద్ధతిలో కేటాయించి అర్హులైన ఏ ఒక్కరి కూడా అన్యాయం జరుగకుండా చేశారని ఎంపీ వద్దిరాజు వివరించారు.ఇప్పటి పాలకులు లాటరీ పద్ధతికి స్వస్తి పలికి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో అసలైన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని విధాలా విఫలం కావడంతో దిక్కుతోచని స్థితిలో బీఆర్ఎస్ బాటపట్టేందుకు సిద్ధంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలను పాలకులు పోలీసుల చేత బెదిరిస్తున్నారని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.ఈవిధంగా రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన కొనసాగుతున్నదని, జిల్లాలోని పేదలకు మేలు చేయడంలో ముగ్గురు మంత్రులు పూర్తిగా విఫలం చెందారని ఆయన విమర్శించారు.ఇండ్ల కేటాయింపులో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరుగకుండా, కాంగ్రెస్ వారితో నింపిన ఇందిరమ్మ కమిటీల రద్దు కోసం ఖమ్మం కలెక్టరేట్ వద్ద గురువారం ఉదయం (నేడు 22వతేదీ)నిర్వహించే ధర్నాకు గులాబీ జెండాలు చేతబూని పెద్ద సంఖ్యలో తరలి రావలసిందిగా ఎంపీ వద్దిరాజు బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు పగడాల నాగరాజు, బెల్లం వేణు,ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి అండగా వారధి ఫౌండేషన్

- ఆలయానికి రూ 25వేలు విరాళం ఇచ్చిన వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య



**ఖమ్మం, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఖమ్మం నగరంలోని కాల్వోడ్డు ఎఫ్సీఐ గోడౌన్ వద్ద ఉన్న శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి అండగా వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య విజయదశమి పర్వదినం రోజు మంగళవారం 25వేల రూపాయలను ఆర్థిక సహాయం చేశారు. ఆలయ అభివృద్ధి కోసం ఈ 25వేల రూపాయల విరాళాన్ని అందించినట్లు వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య పేర్కొన్నారు. గతంలో మున్నేరుకు వచ్చిన వరదల వలన ఆలయం ముంపుకు గురి కావడంతో ఆలయ మరమ్మత్తులకు తమ సంస్థ అండగా నిలుస్తున్నదని తెలిపారు. ఆలయంలో సకల పూజా కార్యక్రమాలు విఘాతం లేకుండా జరగడానికి తమ వారధి ఫౌండేషన్ ద్వారా 25వేల రూపాయలను ఆలయ అర్చకులు మేడూరి రవికుమార్ కు అందజేశామని తెలిపారు. దైవ కార్యంలో తమ వారధి ఫౌండేషన్ తొలి కార్యక్రమంగా భాగస్వాములు అవుతున్నందుకు ఆనందంగా ఉందని తెలియజేశారు. వారధి ఫౌండేషన్ మొదటి సేవా కార్యక్రమాన్ని కలియుగ దైవం అఖిలాండ బ్రహ్మాండ కోటీ వైకుంఠ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో నిర్వహిస్తున్నామని తెలియజేశారు. దైవ సంకల్పంతో తాము నిర్వహిస్తున్న సేవా సంస్థ కార్యక్రమాలు దిగ్విజయంగా జరగడానికి దీవెనలు అందించాలని స్వామివారికి మొక్కులు చెల్లించామని తెలిపారు. ఇదే విధంగా దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య తో పాటు వారధి వారధి ఫౌండేషన్ సభ్యులు ఎం సాయి, చిక్కుళ్ల వెంకటేష్, పగిళ్లపల్లి రాజు,నాగరాజు,శివ, ఆలయ అర్చకులు మేడూరి రవికుమార్ , భక్తులు తదితరులు పాల్గొన్నారు.కోరారు. ఈ ఘటన ఖండించిన వారిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సింగరేణి మండల అధ్యక్ష, కార్యదర్శులు కేశగాని ఉపేందర్, యనమనగండ్ల రవి తదితరులు ఉన్నారు.

## బ్రహ్మంగారిమఠం మండలంలో రెండో రోజు 24 నామినేషన్లు



- టీడీపీ - 23 జనసేన -1 నామినేషన్లు దాఖలు

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):స్థానిక సంస్థ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. బ్రహ్మంగారిమఠం మండలంలో రెండో రోజు 24నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో టీడీపీ పార్టీ తరఫున 23 జనసేన తరపున 1 నామినేషన్లు నమోదయ్యాయి. స్వతంత్ర అభ్యర్థుల నుంచి నామినేషన్లు దాఖలు కాలేదు. మండలంలో మొత్తం 11 పంచాయతీలు ఉండగా ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. నేడు చివర రోజు మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశముందని రిటర్నింగ్ ఆఫీసర్ నాగయ్య తెలిపారు.

## ఆర్గనైజ్డ్ క్రైమ్‌తో ఎన్నికలు ఆపేందుకు జగన్ అండ్ కో కుట్ర: టీడీపీ నేత వర్మ



- ఎన్నికలు ఆపడమే లక్ష్యంగా వైసీపీ హింసకు పాల్పడుతోందన్న వర్మ
- ఓటర్ల జాబితా సవరణతో దొంగ ఓట్లు బయటపడతాయని భయపడుతున్నారని విమర్శలు
- రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోనే హింస వెనుక కుట్ర అని ఆరోపణ
- హింసాత్మక ఘటనలపై ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**అమరావతి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతోనే జగన్ గుండెల్లో వణుకు మొదలైందని, ప్రజల తిరుగుబాటును చూసి ఓటమి భయంతో ఎన్నికలను ఏదో ఒక రకంగా ఆపేందుకు 'గొడ్డలి పార్టీ' కుట్రలు పన్నుతోందని టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆర్గనైజ్డ్ క్రైమ్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే జగన్ అండ్ కో నైజమని ఆయన మండిపడ్డారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అడ్డుకోవడానికి వైసీపీ ముఠా విశ్వప్రయత్నాలు చేస్తోందని వర్మ ఆరోపించారు. దీని వెనుక ఉన్న కారణం స్పష్టమని, బూత్‌ల స్థాయిలో గతంలో చేసిన ట్యాంపరింగ్ బండారం బయటపడుతుందని, చనిపోయిన వారి పేర్లతో దొంగ ఓట్లు వేయించుకోవడం, రిగ్గింగ్ చేయడం ఇకపై సాధ్యం కాదనే భయంతోనే జగన్ రెడ్డి ఓటర్ల జాబితా ప్రక్షాళనను చూసి గిలగిలా కొట్టుకుంటున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాలు స్వయం సమృద్ధి సాధించకుండా, స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా, పంచాయతీలకు నిధులు రాకుండా అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు కోర్టుల్లో ఏకంగా 59 కేసులు వేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలను అణచివేయడమే వైకాపా నైజమని, బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారని ఆరోపించారు. చంద్రబాబు మాత్రం బీసీల పక్షపాతిగా నిలిచి, స్థానిక సంస్థల్లో 34 శాతానికి పైగా స్థానాలు కేటాయించి వారిని రాజకీయంగా ప్రోత్సహించారని తెలిపారు.

వైసీపీపై ప్రజల్లో విశ్వాసం పూర్తిగా అడుగంటిందని, దీంతో ఉనికి కోల్పోతామనే భయంతో దాడులకు దిగుతూ వార్తల్లో నిలిచేందుకు తాపత్రయపడుతున్నారని వర్మ అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ హింస చెలరేగినా అది పక్కా ప్లాన్ ప్రకారం ఎన్నికలు ఆపేందుకు వైసీపీ పన్నుతున్న వ్యూహంలో భాగమేనని ప్రజలు గ్రహించాలన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కేవలం రాయలసీమలోని 15 సమస్యాత్మక ప్రాంతాలు, ప్రకాశం, పల్నాడు ప్రాంతాల్లోనే హింసాత్మక ఘటనలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. ఒకవైపు ఆ పార్టీ నేత కోన రఘుపతి ఎన్నికల సంఘం ఏర్పాట్లను ప్రశంసిస్తుంటే, మరోవైపు జగన్ అనుచరులు ఎన్నికల వ్యవస్థపై విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు.

2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ చేసిన దుర్మార్గాలను ఎవరూ మరిచిపోలేదని, టీడీపీ అభ్యర్థులను భయపెట్టి వెయ్యికి పైగా నామినేషన్లను బలవంతంగా ఉపసంహరింపజేశారని వర్మ ఆరోపించారు. పుంగనూరు, తంబళ్లపల్లె, చంద్రగిరి, పులివెందుల, మాచర్ల వంటి మున్సిపాలిటీల్లో ప్రత్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేసి బలవంతపు ఏకగ్రీవాలు చేసుకున్నారని, పిఠాపురంలో నడిరోడ్డుపై బ్యాలెట్ బాక్సులను ఎత్తుకెళ్లి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని అన్నారు.

## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి : ఎమ్మెల్యే నసీర్

- తూర్పులో రెండున్నరేళ్లలో రూ.400 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
- కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి
- ఒకటో వార్డులో మేయర్ అభ్యర్థి లక్ష్మీఅపర్ణ, కార్పొరేటర్ అభ్యర్థి కోట పిచ్చిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే నసీర్ ఎన్నికల ప్రచారం



**గుంటూరు, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి అంటే తెలియజేశామని, స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ అభ్యర్థులను ఆశీర్వదించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ పిలుపునిచ్చారు. గురువారం తూర్పు నియోజకవర్గంలోని ఒకటో డివిజన్లో కూటమి బలపరిచిన మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ, కార్పొరేటర్ అభ్యర్థి కోట పిచ్చిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే నసీర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కు వచ్చిన నాయకులకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గత వైసీపీ పాలనలో నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో రూ.400 కోట్లతో అభివృద్ధి, సంక్షేమాన్ని అందించామని తెలిపారు. కేవలం రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించామని చెప్పారు. ప్రతి సమస్యకూ పరిష్కారాన్ని చూపిస్తున్నామని, ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటున్నామని తెలిపారు.

గుంటూరు నగరాన్ని అభివృద్ధిలో మోడల్ గా తీర్చిదిద్దేందుకు ముందడుగు వేశామని, రానున్న స్థానిక ఎన్నికల్లో కార్పొరేటర్ అభ్యర్థిగా కోట పిచ్చిరెడ్డిని, మేయర్ అభ్యర్థిగా లక్ష్మీ అపర్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మున్సిపాలిటీలో కూటమికి బలం చేకూర్చడం ద్వారా నగర అభివృద్ధి రెట్టింపు అవుతుందని చెప్పారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు.

## జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు




**గుంటూరు, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ, భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియకు, మండల పరిషత్ కార్యాలయాల్లో జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్లకు తగినంత మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు, వారి ప్రతినిధుల రాకపోకలు, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, బారికేడ్ల ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు అనుమతించిన ఇద్దరు వ్యక్తులకు మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి ప్రవేశం ఉంటుందని స్పష్టం చేశారు. పరిమితికి మించి ఎవరూ కేంద్రాల పరిధిలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని, బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచించారు.

గుంటూరు రూరల్, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, పొన్నూరు, చేబ్రోలు, తెనాలి రూరల్, కొల్లిపర, దుగ్గిరాల, పెదకాకాని, ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల్లోని నామినేషన్ కేంద్రాల పర్యవేక్షణకు సీఐ స్థాయి అధికారులను నియమించినట్లు ఎస్పీ తెలిపారు. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ముందస్తు బైండోవర్లు చేపట్టాలని, లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను త్వరితగతిన అమలు చేయాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద రెండు వర్గాలు ఒకేసారి గుమిగూడకుండా సమన్వయం చేసి, వేర్వేరు సమయాల్లో వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పోలీసు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల విధులను అప్రమత్తంగా నిర్వహిస్తూ నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా సాగేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## ప్లాస్టిక్ రహిత మంగళగిరి-తాడేపల్లే లక్ష్యం..

- నిషేధిత ప్లాస్టిక్‌పై విస్తృత తనిఖీలు



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్. అలీమ్ బాషా ఆదేశాల మేరకు గురువారం తాడేపల్లి ప్రాంతంలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ మల్లిక ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యదర్శులు వివిధ దుకాణాలు, వాణిజ్య సంస్థలను తనిఖీ చేశారు. ముఖ్యంగా తాడేపల్లి బైపాస్ సర్వీస్ రోడ్డు పరిసరాల్లో తనిఖీలు చేపట్టి, 15 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని, రూ.5 వేల జరిమానా విధించారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమంగా తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చేలా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో తనిఖీలు కొనసాగించడంతో పాటు నిషేధిత ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ నష్టాలపై వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులు, కాగితపు సంచులు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచిస్తున్నారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించినా, విక్రయించినా నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ చేపడుతున్న ప్లాస్టిక్ రహిత చర్యలకు వ్యాపారులు, ప్రజలు సహకరించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన మంగళగిరి– తాడేపల్లి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

## పవన్ రాజీనామా అంటూ ఫేక్ న్యూస్

**అమరావతి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన పదవికి రాజీనామా చేస్తున్నారంటూ వాట్సాప్‌లో తప్పుడు సమాచారాన్ని సర్క్యులేట్ చేసిన ఓ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ క్షమాపణలు చెప్పారు. ఈ ఫేక్ న్యూస్‌ను తీవ్రంగా పరిగణించిన ఉప ముఖ్యమంత్రి కార్యాలయం సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించడంతో, సదరు అడ్మిన్ వెనక్కి తగ్గారు. సోషల్ మీడియాలో వచ్చిన ఒక పోస్ట్ చూసి, నిజానిజాలు నిర్ధారించుకోకుండా "పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా" అని గ్రూప్‌లో షేర్ చేసినట్లు అడ్మిన్ తన వివరణలో తెలిపారు. ఇది ఎలాంటి దురుద్దేశంతో జరగలేదని, పొరపాటున జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పవన్ కల్యాణ్‌కు, జనసేన నాయకులకు, కార్యకర్తలకు, గ్రూప్ సభ్యులకు మనస్ఫూర్తిగా క్షమాపణ చెబుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పూర్తి వివరాలు తెలుసుకున్నాకే పోస్టులు షేర్ చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు, పవన్ రాజీనామా చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై డిప్యూటీ సీఎం కార్యాలయం తీవ్రంగా స్పందించింది.

## రెండవ రాండమైజేషన్ పూర్తి



**గుంటూరు, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్):** ఎన్నికల సిబ్బంది రెండవ రాండమైజేషన్ గురువారం పూర్తి అయింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ కేంద్రంలో రాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య, వ్యయ పరిశీలకులు నందిని సలారియాల ఆధ్వర్యంలో పూర్తి చేశారు. రాండమైజేషన్ ప్రక్రియను
జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ, వివరించారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ.కిషోర్, పాల్గొన్నారు.

## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ.. 6 గంటల్లోనే శ్రీవారి సర్వదర్శనం



- తిరుమలలో గణనీయంగా తగ్గిన భక్తుల రద్దీ
- ప్రస్తుతం 12 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు
- సర్వదర్శనం 6 గంటల్లో పూర్తి
- బుధవారం శ్రీవారిని దర్శించుకున్న 73 వేల మంది భక్తులు
- హుండీ ద్వారా రూ. 2.66 కోట్ల ఆదాయం

**తిరుమల:** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ గణనీయంగా తగ్గింది. గత కొన్ని రోజులుగా కొనసాగిన రద్దీకి భిన్నంగా, ప్రస్తుతం కొండపై ప్రశాంత వాతావరణం నెలకొంది. దీంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా శ్రీవారిని దర్శించుకుంటున్నారు.

గురువారం ఉదయం నాటికి భక్తులు కేవలం 12 కంపార్ట్‌మెంట్లలో మాత్రమే శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. సాధారణంగా వారాంతాల్లో, పర్వదినాల్లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయి, వెలుపల కిలోమీటర్ల మేర క్యూలైన్లు కనిపిస్తాయి.

అయితే, ప్రస్తుతం రద్దీ తక్కువగా ఉండటంతో భక్తులకు నిరీక్షణ సమయం బాగా తగ్గింది. టైమ్‌స్లాట్ (ఎస్ఎస్‌డీ) టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 6 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు.

ఇక బుధవారం (అక్టోబర్ 21) నాడు శ్రీవారిని దర్శించుకున్న భక్తుల వివరాలను టీటీడీ విడుదల చేసింది. నిన్న ఒక్కరోజే 73,226 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 24,754 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## సోమిరెడ్డిపల్లె ఎంపీటీసీ-3 కూటమి అభ్యర్థిగా బరిలో సారే రామానాయుడు



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్): మండల కేంద్రంలోని వీరభద్రాపురం గ్రామానికి చెందిన సారే రామానాయుడు తండ్రి బండి రామన్న (జ్యోతి రిపోర్టర్ )సోమిరెడ్డిపల్లె ఎంపీటీసీ–3 స్థానానికి కూటమి ఉమ్మడి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేసి పోటీలో ఉన్నానని తెలియజేసుకుంటున్నాను.

మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆశీస్సులు నాపై ఉండాలని,మండల తెలుగు దేశం నాయకులు, సోమిరెడ్డిపల్లె ఎంపీటీసీ–3 పరిధిలోని కార్యకర్తలు,ఓటర్లు తనకు మద్దతు తెలిపి అత్యధిక ఓట్లతో నన్ను గెలిపించాలని ఆయన కోరారు.

**ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా**

తాను ఎల్లప్పుడూ నిస్వార్థ సేవతో ప్రజలకు అందుబాటులో ఉంటానని సారే రామానాయుడు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి తమ కుటుంబం పార్టీలోనే ఉందని,అవకాశం ఇస్తే పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. ఎంపీటీసీగా గెలిపిస్తే తన పరిధిలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాలను గుర్తించి,వాటిని పూర్తి చేసేందుకు నా శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ మరియు మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ తనకు అవకాశం ఇస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## ఫోటో ఓటరు స్లిప్ లు పంపిణీ చేయాలి : జిల్లా ఎన్నికల అధికారి సాయికాంత్ వర్మ



**గుంటూరు, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్):** మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఫోటో ఓటరు స్లిప్ లు పంపిణీ చేయాలని, వాటిని సిద్ధం చేసి ఉంచాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు.

ఎన్నికల నోడల్ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ, సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య, వ్యయ పరిశీలకులు నందిని సలారియా, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో డీ లిమిటేషన్ వలన కొంత మంది ఓటర్లు ఓటు హక్కు ఎక్కడ ఉందో సందిగ్ధావస్థలో ఉన్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజేసారని, ఇందుకుగాను క్యూ ఆర్ కోడ్ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

జెడ్.పీ.టీ.సీ, ఎం.పీ.టీ.సీ ఎన్నికలకు శుక్రవారం ఎక్కువ నామినేషన్లు వచ్చే అవకాశం ఉందని, అందుకు రిటర్నింగ్ అధికారులు ముందస్తు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెల్ప్ డెస్క్ మరింత క్రియా శీలంగా పనిచేయాలని ఆదేశించారు. తర్ఫీదు పొందిన సిబ్బందిని వినియోగించాలని అన్నారు. వంద మీటర్ల దూరం విధిగా పాటించాలని పేర్కొన్నారు. నిర్ణీత సమయంలో వచ్చే వారికి టోకెన్ లు జారీ చేయాలని సూచించారు. నామినేషన్లు పూర్తి జరిగిన వెంటనే స్క్రూటినీకి సిద్ధం కావాలన్నారు. రెండు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

**శుక్రవారం పి.ఓలు, ఏ.పి.ఓలు శిక్షణ**

జెడ్.పీ.టీ.సీ, ఎం.పీ.టీ.సీ ఎన్నికలకు సంబంధించి పి.ఓలు, ఏ.పి.ఓలకు మొదటి శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభం అవుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ శిక్షణకు హాజరు కావాలని స్పష్టం చేశారు. శిక్షణకు హాజరుకాని సిబ్బందికి షో కాజ్ నోటీస్ జారీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

**24, 25న పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటెషన్ కేంద్రాలు**

ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, సూచనల మేరకు, పోస్టల్ బ్యాలెట్ జారీ చేయుటకు 24, 25వ తేదీలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటెషన్ కేంద్రం ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలని తెనాలి మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించారు.

సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ ఓటరు స్లిప్ పంపిణీపై దృష్టి సారించాలని అన్నారు. శత శాతం పంపిణీ జరుగుటకు శ్రద్ధ వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని అన్నారు.

వ్యయ పరిశీలకులు నందిని సలారియా మాట్లాడుతూ అభ్యర్థుల వ్యయాల నమోదు కచ్చితంగా జరగాలని అన్నారు.

పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ర్యాలీలు, సమావేశాలు జరగరాదని, ఎన్నికల ప్రవర్తన నియమావళి స్పష్టంగా అమలు చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, అదనపు ఎస్పీ జి.వి.రమణ మూర్తి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# గుంటూరు పశ్చిమలో లక్ష్మీ అపర్ణకు మద్దతుగా కూటమి రోడ్‌షో



**గుంటూరు, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర మేయర్ పదవికి కూటమి మద్దతుతో పోటీ చేస్తున్న కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు మద్దతుగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో జరిగిన రోడ్‌షోలో టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సాగిన రోడ్‌షోకు స్థానికులు స్వాగతం పలికారు. డివిజన్ల వారీగా కార్పొరేటర్ అభ్యర్థులు, డివిజన్ అధ్యక్షులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు. కూటమి అభ్యర్థికి మద్దతుగా నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని కొనసాగించారు.

రోడ్‌షోలో మహిళలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ప్రజలను కలిసి తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. గుంటూరు నగర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంపై కూటమి నాయకులు తమ ప్రచారంలో ప్రస్తావించారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు దేవాలయాలు, మసీదులను నాయకులు సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రోడ్‌షో కొనసాగింది.

కూటమి కార్పొరేటర్ అభ్యర్థులు షేక్ షర్మిల, షేక్ షాజహాన్, ఉల్లి గోపాలకృష్ణ, కావటి విక్రమ్ నాయుడు, బోనబోయిన సుజాత, కుంచపు త్రిపుర వాసవి, గంటా మౌళిక, తుమ్మల నాగమల్లేశ్వరి, చెన్నం వెంకట సీతయ్య, గాలం వెంకటేశ్వర్లు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

# సంగడిగుంటలో కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు ఘన స్వాగతం



- భీమనాదం భరత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం
- సిమ్స్ కాలేజీ నుంచి భారీ కాన్వాయ్‌తో ర్యాలీ

**గుంటూరు, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు సంగడిగుంటలో ఘన స్వాగతం లభించింది. తెలుగుదేశం యువ నాయకుడు భీమనాదం భరత్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశం, భారీ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

తొలుత భీమనాదం భరత్ రెడ్డి నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో లక్ష్మీ అపర్ణ విజయానికి సమష్టిగా కృషి చేయాలని టీడీపీ, కూటమి నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం సిమ్స్ కాలేజీ నుంచి సంగడిగుంటలోని భరత్ రెడ్డి నివాసం వరకు భారీ కాన్వాయ్‌తో ర్యాలీ నిర్వహించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, లక్ష్మీ అపర్ణ, భీమనాదం భరత్ రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు.

ర్యాలీ మార్గంలో స్థానికులు పూలవర్షం కురిపిస్తూ లక్ష్మీ అపర్ణకు స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తల సందడి, కాన్వాయ్‌తో సంగడిగుంట ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా భీమనాదం భరత్ రెడ్డి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో లక్ష్మీ అపర్ణ విజయానికి కూటమి శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని, ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉగ్గిరాల సీతారామయ్య, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, 20వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి శ్రీనివాసరావు, 22వ వార్డు కార్పొరేటర్ సంకూరి శ్రీను, 17వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి నిజాముద్దీన్, అంకం మాళిని, సాయి, వనజ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుంది



**గుంటూరు, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ, సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య, వ్యయ పరిశీలకులు నందిని సలారియా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ ఎన్నికల ప్రక్రియను వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నిర్వహణపై సమాచారం, స్పందన తెలియజేస్తే అందుకు అనుగుణంగా చర్యలు చేపడతామని తెలిపారు.

ఓటరు చీటీలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని రాజకీయ పార్టీల ప్రతినిధులు అన్నారు. డివిజన్ల విభజన కారణంగా ఓటు ఎక్కడ ఉందో కొంత మందికి తెలియడం లేదని, దానిపై దృష్టి పెడితే బాగుంటుందని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ.కిషోర్, కాంగ్రెసు పార్టీ ప్రతినిధి బోట్ల బ్రహ్మయ్య, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు కంచర్ల శివరామయ్య, ఎన్.ఓంకార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి డా.టి.సేవ కుమార్, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతన గండ్ల వాసు, సి.పి.యం ప్రతినిధి బి. ముత్యాల రావు, వైఎస్ఆర్సిపి ప్రతినిధి వై పిచ్చి రెడ్డి, జన సేన పార్టీ ప్రతినిధి త్రినాథ్, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వై వి సుబ్బారావు, తదితరులు హాజరయ్యారు.

# కూటమి అభ్యర్థుల గెలుపే-నిడదవోలు సమగ్ర అభివృద్ధికి మార్గం: మంత్రి దుర్గేష్

- 7,10, 23, 24, 25 వార్డులు, వైఎస్సార్ కాలనీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్
- కూటమి మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి మురాల జ్యోతి, వార్డు అభ్యర్థుల తరపున ప్రచారం



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా నిడదవోలు పట్టణంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విస్తృతంగా పర్యటించారు. కూటమి మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి మురాల జ్యోతితో పాటు స్థానిక కూటమి అభ్యర్థులతో కలిసి ఆయన నిడదవోలు పట్టణంలోని 7,10, 23, 24, 25 వార్డులతో పాటు వైఎస్సార్ కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

7వ వార్డు కూటమి జనసేన అభ్యర్థి గుర్రం శాంతి శ్రీ, 10వ వార్డు టిడిపి అభ్యర్థి మహమ్మద్ షకీనా అన్సారీ బేగం, 23వ వార్డు కూటమి టీడీపీ అభ్యర్థి గొబ్బిళ్ళ ఫణిరాజ్, 24వ వార్డు బీజేపీ అభ్యర్థి సన్నిధి శ్రీనివాస్, 25వ వార్డు జనసేన అభ్యర్థి మాడిపాటి నాగమణిల తరఫున ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. క్షేత్రస్థాయిలో వార్డుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన సాధ్యపడాలంటే కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా ఒక ఓటు కూటమి మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థికి, మరొక ఓటు స్థానిక వార్డు కూటమి అభ్యర్థికి వేసి విజయాన్ని అందించాలని కోరారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో నిడదవోలు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. గడిచిన రెండున్నర ఏళ్ల కూటమి ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని, అభివృద్ధికి మద్దతుగా నిలిచి కూటమికి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల ప్రచారానికి ముందు మంత్రి దుర్గేష్ స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మేయర్‌గా గెలిపించండి... అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా

- డొక్కా మిత్రమండలి ఆత్మీయ అల్పాహార విందులో కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ
- కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని కొనసాగిస్తూ నగర ప్రగతికి కృషి చేస్తా



**గుంటూరు, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర అభివృద్ధికి మరింత కృషి చేస్తానని నగర కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం. కేంద్ర మంత్రి చంద్రశేఖర్, గల్లా మాధవి నజీర్ అహ్మద్, బుర్ల రామాంజనేయులు నగర అభివృద్ధికి చేసిన కృషిని కొనసాగిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని మరింత ప్రగతిపథంలో నడిపించేందుకు శ్రమిస్తానని తెలిపారు. నగర ప్రజలు, పుర ప్రముఖులు తనను ఆశీర్వదించి మద్దతుగా నిలవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

గుంటూరులో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కార్యాలయంలో డొక్కా మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ అల్పాహార విందు కార్యక్రమానికి లక్ష్మీ అపర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులతో ఆమె ఆత్మీయంగా ముచ్చటించారు.

ఈ సందర్భంగా లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమన్వయంతో, మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహంతో గుంటూరు నగర అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. నగర ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు తనకు అవకాశం కల్పించి ఆశీర్వదించాలని కోరారు.

**కూటమి ప్రముఖులతో లక్ష్మీ అపర్ణ ఆత్మీయ భేటీ**

డొక్కా మిత్రమండలి నిర్వహించిన ఈ అల్పాహార విందులో రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ,టీడీపీ నేతలు రావి వెంకటరమణ, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, మాజీ శాసన సభ్యులు జనసేన పార్లమెంటు సమన్వయకర్త కిలారు రోశయ్య, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు, తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, తెలుగుయువత నాయకుడు అబ్బూరి మల్లి, తాడిశెట్టి మురళి, చందు సాంబశివరావు, రావిపాటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

కార్యక్రమానికి హాజరైన ప్రముఖులను లక్ష్మీ అపర్ణ ఆత్మీయంగా పలకరిస్తూ, వారితో సంభాషించారు. నగర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

# అనంతపురంలో ఏపీఎస్ఈఏ జిల్లా కార్యాలయం ప్రారంభం



**అనంతపురం, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీఎస్ఈఏ) అనంతపురం జిల్లా కార్యాలయాన్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్‌భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అసోసియేషన్ నిరంతరం పనిచేస్తుందని చెప్పారు.

పదోన్నతులు, వేతన సవరణలు, కరువు భత్యం తదితర అంశాలపై ఉద్యోగుల తరపున బలంగా పోరాడతామని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కార్యాలయం ప్రారంభంతో జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యలను అసోసియేషన్ దృష్టికి తీసుకువచ్చేందుకు మరింత సౌకర్యవంతమైన వేదిక అందుబాటులోకి వచ్చిందన్నారు. ఉద్యోగ సంఘాల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ ఉద్యోగుల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేస్తామని విజయ్‌భాస్కర్ తెలిపారు. ఉద్యోగులకు ఎలాంటి సమస్య ఎదురైనా అసోసియేషన్ అండగా నిలుస్తుందని, వారి గొంతుకగా పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అసోసియేషన్‌ను బలోపేతం చేసి ఉద్యోగుల హక్కుల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో హెచ్ఎం అసోసియేషన్ నాయకుడు ఆదిశేషయ్య, ఎస్ఎల్‌టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, బీసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శివమూర్తి, డీటీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు నెట్టెం వెంకటేష్, ఏపీఎస్ఈఏ జిల్లా నాయకుడు జోషికుమార్, ఎంఐఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామన్న, ఎస్‌కేయూ ఇంజినీరింగ్ అండ్ ఫార్మా ఎంప్లాయిస్ నాయకులు రవిమోహన్, మురళీ, దుర్గాప్రసాద్, అహుడా ఇంజినీర్ కిరణ్‌కుమార్, పీపుల్స్ హ్యూమన్ రైట్స్ నాయకుడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు



- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

**మంగళగిరి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రానికి రావాల్సిన 16వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.12,500 కోట్లు త్వరగా అందేలా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ ఇప్పటికే 56 లిటిగేషన్ పిటిషన్లు వేసిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఎన్నికలను వాయిదా వేయరాదని, నామినేషన్ల గడువు పొడిగించరాదని స్పష్టం చేసినప్పటికీ ఆ పార్టీ నేతలు తీర్పును వక్రీకరిస్తున్నారని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలకు వైసీపీ నేతలే కారణమని ఆరోపించారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమ కేసులు, బలవంతపు నామినేషన్ ఉపసంహరణలు, దాడులు, బెదిరింపులు, హత్యలు, కిడ్నాప్‌లు చోటుచేసుకున్నాయని రామాంజనేయులు పేర్కొన్నారు. అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కేంద్ర హోంశాఖకు లేఖ రాసి ఎన్నికల సమయంలో ఎదురైన ఒత్తిళ్లు, హింసపై ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

ప్రస్తుతం ప్రశాంతంగా జరుగుతున్న ఎన్నికలను అడ్డుకోవడం రాష్ట్ర అభివృద్ధిని, 16వ ఫైనాన్స్ కమిషన్ నిధులను, గ్రామీణ మౌలిక వసతులను అడ్డుకోవడమేనని అన్నారు.

కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.

# ఏపీ సీఎస్ సాయి ప్రసాద్ పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగింపు



**అమరావతి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. దీంతో ఆయన 2027 మే 31 వరకు సీఎస్‌గా కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ పరిధిలోని సిబ్బంది, శిక్షణ విభాగం (డీఓపీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు సీఎస్ పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ అండర్ సెక్రటరీ రాజేశ్ కుమార్ యాదవ్ రాష్ట్ర సాధారణ పరిపాలన (పొలిటికల్) శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ ద్వారా తెలియజేశారు.

1991 బ్యాచ్‌కు చెందిన జి. సాయి ప్రసాద్ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన పదవీకాలాన్ని ఇప్పటికే 2026 జూన్ 1 నుంచి నవంబరు 30 వరకు ఆరు నెలలు పొడిగించారు. ఈ నేపథ్యంలో నవంబరు 30న పదవీ విరమణ చేయాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 29న మరోసారి పదవీకాలం పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం సాయి ప్రసాద్ పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజా పొడిగింపుతో ఆయన 2027 మే 31 వరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు.

# వెబ్ సైట్ లింక్‌లో ఓటు ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు

**గుంటూరు, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకొనుటకు రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్ సైట్ లింక్ లో పరిశీలించుకోవచ్చుని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

ఈ క్రింద తెలిపిన వెబ్ సైట్ లింక్ ఓటరు వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. https://sec-ems.ap.gov.in/apsec/voterPortal. ఈ అవకాశాన్ని ఓటర్లు అందరూ వినియోగించుకొని, ముందుగానే తమ ఓటు ఎక్కడ ఉందో తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఏపీకి మరో తుపాను ముప్పు? బంగాళాఖాతంలో అనుకూల పరిస్థితులు!

- బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాతావరణ వ్యవస్థ
- అండమాన్ సమీపంలో ఉపరితల ఆవర్తనం గుర్తింపు
- అక్టోబర్ 23 నాటికి అల్పపీడనంగా మారే అవకాశం
- పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఏపీ తీరం వైపు రావొచ్చని అంచనా
- తుపానుగా మారితే కోస్తాంధ్రపై ప్రభావం చూపే సూచనలు



**అమరావతి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్):** బంగాళాఖాతంలో మరో తుపాను భయం నెలకొంది. ఈశాన్య రుతుపవనాల సమయంలో ఏర్పడే వాతావరణ మార్పులు, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత ప్రజలను మరోసారి ఆందోళనకు గురిచేస్తున్నాయి. అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా బలపడి, అల్పపీడనంగా మారి తుపానుగా రూపాంతరం చెందే సూచనలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా పయనించే అవకాశాలు ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 22 ఉదయం 5:30 గంటల సమయంలో ఉత్తర అండమాన్ సముద్రం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వాతావరణ నిపుణులు గుర్తించారు. ఈ ఆవర్తనం ప్రభావంతో అక్టోబర్ 23 నాటికి ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రానున్న రోజుల్లో మరింత బలపడనుందని అంచనా వేస్తున్నారు.

**తుపానుగా మారే అవకాశాలు ఎంత?**

సాధారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలాన్ని పోస్ట్-మాన్‌సూన్ సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడటం సాధారణమే. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు వెచ్చగా ఉండటం, వాతావరణంలో తగినంత తేమ ఉండటం వంటి అనుకూల పరిస్థితులు ఉంటే, ఈ అల్పపీడనాలు త్వరితగతిన వాయుగుండంగా, ఆపై తీవ్ర వాయుగుండంగా మారి తుపానుగా రూపాంతరం చెందుతాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో అలాంటి అనుకూల పరిస్థితులే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, అల్పపీడనం ఏర్పడినంత మాత్రాన, ప్రతిసారీ అది తుపానుగా మారుతుందని చెప్పలేమని, దాని తీవ్రత, కదలికలను నిరంతరం గమనించాల్సి ఉంటుందని వారు విశ్లేషిస్తున్నారు.

**ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం**

ప్రస్తుత అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఈ మార్గంలో ప్రయాణిస్తే అది ఆంధ్రప్రదేశ్ లేదా ఒడిశా తీరాల వైపునకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒకవేళ ఈ వ్యవస్థ తుపానుగా మారితే, దాని ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలపై స్పష్టంగా కనిపించవచ్చు. ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గంటకు 100 కిలోమీటర్ల పైబడిన వేగంతో బలమైన గాలులు, సముద్రంలో అలల తీవ్రత పెరగడం వంటి పరిణామాలు సంభవించవచ్చు.

ప్రస్తుతానికి తుపాను ఎక్కడ తీరం దాటుతుందనే దానిపై స్పష్టత లేనప్పటికీ, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, అధికారిక ప్రకటనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరుతున్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com